ప్రపత్తి

# శ్రీసన్నిధానం

## ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 01 మార్చి 2024 పేజీలు:48 వెల:30





# ముఖచిత్రపరిచయం

తిరుమల శ్రీవారికి మలయప్పస్వామికీ నిత్యం ఉత్సవాలు కళ్యాణాలే! ముఖ్యంగా ప్రతి ఋతువు ఆగమనం ముందుగానే సూచించే పండుగలు ఆలయాలలో ఉత్సవమూర్తులకు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మాఘ, పాల్గుణ మాసాలు శిశిర ఋతువు. ఈ క్రమంలో శీతలంతగ్గి వేడి పెరుగుతుంది. పాల్గుణ శుద్ధ పూర్ణిమకు కాముని పూర్ణిమ అనీ పేరు. మధుర బృందావనంలో ఈ హెూలీ ఉత్సవాన్ని సుమారు 16 రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. భారత దేశంలోనే కాకుండా దేశవిదేశాలలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. భారత సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం అనాది నుంచే ఈ ఆచారం ఉంది. హెూలిక అనే రాక్షస సంహారం ప్రధాన ఘట్టంగా కామదహనం నిర్వహించి రంగులు జల్లుకుంటారు. అప్పటివరకు అనుభవించిన కష్టాలు అంతరించినట్లుగా రంగులు చల్లుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధాన ఆలయాలలో ఉత్సవ మూర్తులకు స్నపనం అనంతరం వసంతోత్సవం నిర్వహించి ఆ పవిత్ర జలాలను భక్తులపై చల్లుకున్న తరువాత ఒకరిపై ఒకరు రంగులు జల్లుకోవడం ఆనవాయితీ. ఇది ఇలా ఉంటే వసంతకాల ఆగమనంతో వాతావరణ మార్పుల వల్ల కొత్త క్రిమికీటకాలు ఉద్భవిస్తాయని వాటి ద్వారా వ్యాధులు సంక్రమించకుండా నిమ్మ, కుంకుమ, పసుపు, బిల్వ ఇత్యాది వనమూలికలతో చేసిన రంగులనే హూలీ ఉత్సవంలో వాడేవారు.

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)

## సంప్రదించండి

పాఠకుల సందేహాలు, సమాధానాలు

జ్యోతిష్య శాస్త్ర విశేషాల కొరకు

వెంటనే సంప్రదించండి.

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

**మీసందేహాలను నివృత్తి చేసుకోండి!!**

-మేనేజింగ్ ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్ట్‌నకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

– ఎడిటర్

ప్రపత్తి **శ్రీసన్నిధానం**

https://srisannidhanam.org

prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 1 01 మార్చి 2024 డింగిరి శ్రీనివాసమూర్తి మార్చి 1, 2024

Karimnagar Volume:01 Issue: 01 March 2024 Editor Dingiri Srinivasa Murthy Pages: 48 Price: 30/-

## ఇందులో

3. ముఖచిత్రపరిచయం
4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
5. నెలవారి పంచాంగం
6. శ్రీరామానుజ సుధామాధురి
శ్రీమతి సముద్రాల శారద
9. శివరాత్రి - లక్ష్మీ జయంతి ప్రత్యేకం
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
11. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
13. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య
15. యజ్ఞములు లోకహితాలు
శ్రీమాన్ శ్రీ డా.ఎమ్.టి.ఆళ్వార్
17. శాస్త్రజ్ఞానము ద్వారా భగవత్‌వైభవం తెలుస్తుందా
శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు
18. అక్రూరుల కృష్ణ భక్తి
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
21. భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ
23. జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
24. భరన్యాసము-భగవంతునిపై భారము
శ్రీమతి వంగల రాధిక
26. శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
28. అవయవ విభూతి
శ్రీమతి కొడకళ్ళ పద్మజ జోతిర్మయి
30. గోపాలోపాయన పురస్కారం
31. పావన గంగోత్రి ఆశ్రమం
32. మన దేవాలయాలు
34. తిరుమలలో ధార్మిక సదస్సు
36. మేడారం జాతర (స్పెషల్ స్టోరీ)
38. అబుదాబిలో అద్భుతం
41. మహాశివరాత్రి (స్పెషల్ స్టోరీ)
44. ఆధ్యాత్మిక వార్తలు
47. బాల విజ్ఞానం
48. శ్రీసన్నిధి-పదకేళీ

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

# సంపాదకీయం

# సమాజ శ్రేయస్సుకు దేవాలయాల పరిరక్షణ



భారతీయ జీవన విధానం నిత్య నూతనంగా విలసిల్లడానికి ప్రాచీన కాలం నుంచి దేవాలయాలు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. కానీ మారుతున్న జీవన విధానాల్లో ఆలయాల పరిరక్షణ క్రమంగా నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఈ నేపథ్యంలో సమాజంలో దేవాలయాలు గతంలో నిర్వహించిన పాత్రను ఆచరించడంలేదు. పాశ్చాత్య దేశాల్లో అక్కడి జీవన విధానం ఎలా ఉన్నా దేవాలయాల నిర్వహణ నూతన ఆలయాల ఏర్పాటు విషయంలో క్రమంగా ఆయా దేశ పాలకుల విధానాల్లో మార్పులు వచ్చినట్లు గమనిస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా ఆలయాలపట్ల, ఆదరణ పెరుగుతోంది. గల్ఫ్ దేశాలలో సైతం ఆలయాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే యుఏఈలో ఒక ఆలయం నిర్మాణం కాగా మరో దేశం ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ విషయంలో దేవాలయాలు ప్రధాన భూమిక నిర్వహిస్తున్న సంగతి గుర్తెరిగినవారు వాటి ఏర్పాటుకు నడుము బిగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న విధానాలను పరిశీలిస్తే ఆసక్తికర అంశాలెన్నో మన ముందు ఆవిష్కృతం అవుతున్నాయి. కొన్ని విషయాలు చెప్పుకోడానికి బాగుండడంతో వాటిని మీడియాలో ప్రచారం చేసిన విధంగా సమాచారాన్ని అందరికీ అందజేస్తున్నారు.

అన్ని అభివృద్ధి చెందిన దేశాలలోలాగే ఆస్ట్రేలియాలో ఎంతోమంది భారతీయులు ఉన్నారు. అలాగే అక్కడ ఏర్పాటుచేసిన ఆలయాలు ఉన్నాయి. అయితే ఆస్ట్రేలియా లోని దేశస్థులు కృష్ణ భక్తి పరవశులై నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. గోకులం పేరుతో ఒక ఆధ్యాత్మిక గ్రామాన్ని ఏర్పాటు చేసి ఆలయాన్ని నిర్మించి నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. గోకులం పేరుతో ఏర్పాటు చేసిన ఈ గ్రామాలలో గ్రామస్థులు వేరెవరో కాదు మన భారతదేశం నుంచి అక్కడకు వలస వెళ్లిన వాళ్లు కాదు కేవలం ఆస్ట్రేలియా దేశంలోనే పుట్టి పెరిగిన వారు వారి జీవన విధానాన్ని పక్కన పెట్టి భారతీయ సంప్రదాయ దుస్తులను ధరించి ఆయా గ్రామాలలో నివాసం ఉంటూ గో పోషణ చేయడం ప్రారంభించారు. అంతేకాకుండా వ్యవసాయానికి కూడా కాడెద్దులను వాడుతూ, కాడెద్దుల బండ్లను సైతం ఉపయోగించడం కనిపిస్తోంది. ఆధునిక విధానాన్ని పక్కన పెట్టి యంత్రాలు లేకుండా వ్యవసాయం చేయడానికి వారు ముందుకు వచ్చారు. ఈ విషయం ఆ నోట ఈ నోట ప్రచారంతో వారాంతపు సెలవుల సందర్భంగా అక్కడకు వెళ్లి ఆ జీవన విధానాల్లో మమేకమై ఆనంద పరవశలవుతున్న వారు కూడా ఆ గ్రామస్థులకు జత కలిశారు. ఇలా గోకులం, బృందావనం లాంటి గ్రామాల విధానానికి పాశ్చాత్యులు ఆకర్షితులై కాలుష్యానికి దూరంగా, ఆనందంగా ఉంటున్నామన్నట్లు తమ భావాలను పంచుకుంటున్నారు. ఇక్కడ ఇది అప్రస్తుతం అనిపించవచ్చు కానీ, మన దేశంలో ఎన్నో ఆలయాలు ఉన్నాయి. అలాగని ఆలయాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం జరుగుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఆలయాలు వ్యాపార దృక్పథంతో నిర్వహిస్తున్నట్లు విమర్శలు వస్తున్న సందర్భాలు ఉన్నాయి. మారుతున్న పరిస్థితులు జీవన విధానాలను అధ్యయనం చేసి సంస్కృతి సాంప్రదాయాలను పునర్జీవింప చేయడానికి ఆలయాల పరిరక్షణ, వాటి వ్యవస్థ నిర్వహణ స్వచ్ఛందంగా నిర్వహించడానికి ముందుకు రావాల్సిన అవసరం కనిపిస్తోంది.

చరిత్రపుటలు తిరగేస్తే ఆలయాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, సంగీత, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేవారు. దీనితో అన్నివేళలా అందరికీ సమన్వయం ఉండేది. సంస్కృతీ సంప్రదాయాలతోపాటు సమాజశ్రేయస్సుకు దేవలయ వ్యవస్థ ప్రధాన భూమిక వహించేది. కాని మారుతున్న పరిస్థితులలో సమయం లేదన్న భావన అందరిలో నెలకొంది. ఆలయాల నిర్వహణకూడా సమాజం పరిధిలో లేకపోడంవల్ల స్వచ్ఛందంగా ఉత్సాహవంతులు ముందుకు వచ్చే అవకాశాలు కనుమరుగు అయ్యాయి. జీర్ణదేవాలయాల పరిరక్షణతో పాటు ఆలయాలకు పూర్వవైభవం వచ్చేలా సమాజంలో చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**మాఘ మాసం 10-03-24 వరకు, 11-03-24 శుక్లపక్షంతో ప్రారంభమై 08-04-24 వరకు ఫాల్గుణ మాసం**

03-03-2024 వరకు శతభిషా కార్తి, 04-03-24 నుండి 16-03-24 వరకు పూ.భా కార్తి, 17-03-2024 నుండి 30-03-24 వరకు ఉ.భా కార్తి, 31-03-24 నుండి రేవతి కార్తి. **పండుగలు :** 06-03-24 సర్వేషాం ఏకాదశి, 08-03-24 మహాశివరాత్రి, 10-03-24 అమావాస్య, 14-03-24 మీన సంక్రమణం, 20-03-24 సర్వేషాం ఏకాదశి, 23-03-24 కామదహనం, 25-03-24 వసంతోత్సవం, హెూళీ పండగ, 28-03-24 సంకష్టహర చతుర్థి.

## మాస ఫలాలు



**మేషం:** ఈ నెల బాగుంటుంది. అన్నిరంగాలందు అభివృద్ధి ఉంటుంది. ప్రయాణాలు కలిసివచ్చును. విద్యార్థులు పరీక్షలు సామాన్యంగా వ్రాయుదురు. ద్వితీయార్థం అనుకూలత ఉండదు.



**వృషభం:** ఈ నెలయందు అన్నిరంగాల అనుకూలంగా ఉంటుంది. వ్యాపారాలు బాగా సాగును. ఆరోగ్యం బాగుండును. పరీక్షలు బాగా వ్రాయుదురు.



**మిథునం:** ఈ నెల అనుకూలంగా ఉన్నందువలన చేయువృత్తి వ్యాపారములు అనుకూలత, ఆర్థికంగా బాగుండును. ఆరోగ్యలాభములు, విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.



**కర్కాటకం:** ఈ నెల అనుకూలంగా లేదు. ప్రతి చిన్న విషయానికి కలవరం ఆందోళనలు, పనులు నిలిచిపోవుట, వాహనప్రమాదాలు, విద్యార్థులు మాత్రం పట్టుదలతో కష్టపడి పరీక్షలు వ్రాయుదురు.



**సింహం:** ఈ నెల అనుకూలంగా లేదు. పనులలో ప్రతిబంధకాలు, ఆరోగ్యసమస్యలు, నేత్ర, శిరో, రోగపీడలు. నిరుత్సాహంగా ఉంటారు. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.



**కన్య:** ఈ నెల మిశ్రమ ఫలితాలు ఇచ్చును. ఆర్థిక లావాదేవీలు బాగుండును. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయలేరు. జ్ఞాపకశక్తితగ్గును. పనులందు ఆటంకము లేర్పడును.



**తుల:** ఈ నెల చాలా బాగుంటుంది. సంతోషంతో, ఉల్లాసంతో జీవనం గడచును. ప్రతీ విషయంలో మీ అదృష్టం కలిసి వచ్చును. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.



**వృశ్చికం:** ఈనెల ఏవిధమైన ఇబ్బందులు తలెత్తవు. సుఖంగా హాయిగా సౌఖ్యంగా జీవనం సాగును. విద్యార్థులు పరీక్షలు చాలా బాగా వ్రాస్తారు. జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండును.



**ధనుస్సు:** ఈ నెలలో అన్ని విధాలుగా బాగుంటుంది. ఆదాయం వృద్ధిచెందును. పరీక్షలు బాగా వ్రాయుదురు. సంఘంలో ఉన్నతస్థితి, పెద్ద వారిని కలుస్తారు.



**మకరం:** ఈనెలలో అన్నిరంగాలవారికి రాణింపు ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. కాని కోపం అధికంగా ఉండును. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.



**కుంభం:** ఈ నెల అనుకూలంగా లేదు పరిస్థితులు అనుకూలించవు. ధనమునకు ఇబ్బందులు ఋణాలు చేయవలసి వచ్చును. విద్యార్థులు పరీక్షలు బాగా వ్రాయుదురు.



**మీనం:** ఈ నెల అనేక సమస్యలు ఎదురగును. ఆరోగ్యం బాగుండదు. ఆర్థికంగా ఇబ్బందులు, ఉద్యోగులకు బదిలీలు. మనస్తాపంకు గురి అగుదురు. విద్యార్థులకు అనుకూలం.

**ఫాల్గుణ మాసం విష్ణుప్రీతికర మాసం. శ్రీ విష్ణువునకు క్షీరాన్న నివేదన చేసి ప్రసాదంగా స్వీకరించాలి. ఈ నెల హెూళీ రోజున ఊయలలో శ్రీకృష్ణ ప్రతిమ నుంచి పూజించడం విశేష ఫలప్రదం. మరియు ఈ రోజున లక్ష్మీదేవిని అర్చిస్తే వారికి సమస్త ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి. ఈ నెలలోనే వసంతోత్సవం జరుపుకోవటం. ఆ రోజు వసంతాలు (సింధూరచూర్ణం, భర్గుండ, చందనము పొడి వంటివి) ఆడడం మన తెలుగునాట ప్రాచుర్యం పొందింది.**

## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు 3,13,16,17,27,28,30.**

# సంతుష్టాంతరంగ సరస్వతీ మాత



**- శ్రీమతి సముద్రాల శారద**

సదాచార, సాంప్రదాయ అనుసరణల వలన వారి జీవన గతి శుభప్రదంగా సాగుతుంది. నిస్సందేహంగా శాంతి ఆనందాలతో సహజీవనం చేయాలంటే (భారతీయ సనాతన ధర్మాన్ని) వేదోక్త ధర్మమూలాలను తెలుసుకొని తీరాలి. ప్రధానంగా అవి మన జీవన విధానాల్లోనే అవినాభావ సంబంధాన్ని కలిగి ఉండేలా మన పెద్దలు ఏర్పాటు చేశారు. వాటిని మన సంస్కృతిలోనే సమ్మిళితం చేశారు. అన్నింటికీ కారణాలు ప్రయోజనాలు తెలుసుకోక పోయినప్పటికీ వాటిని అనుసరించడం వలననే మానవజాతి సత్ప్రయోజనాలను పొందగలదనేది యదార్థము!

ఒకవేళ నిష్పక్షపాతంగా, పరిపక్వమైన జ్ఞానంతో, పరిశీలనా విచక్షణలతో సంస్కృతి విశేషాలకు కారణాలను ప్రయోజనాలను తెలుసుకొనవచ్చును. అలా తెలుసుకొని వాటిని ప్రకాశితం చేసినవారు సమాజంలో గురువు స్థానంలో ఉంటారు. ఆ విధంగా ఆధ్యాత్మిక రంగంలో లోకహిత పథాన్ని చూపే మార్గదర్శకులు ఎందరో ఉన్నారు. వేద ధర్మాలను, భగవత్ తత్వాన్ని, భౌతిక ప్రకృతి రూపాన్ని, జీవితత్వాన్ని ఎందరో జ్ఞానులు ఎన్నో రకాలుగా నిర్వచించి నిరూపించారు. మారింకెందరో వివరణలతో వ్యాఖ్యానాలతో నేటికీ నిర్వచిస్తూనే ఉన్నారు.

భగవత్ తత్వాన్ని ద్వైతాద్వైత విశిష్టాద్వైతములుగా నిరూపించి శ్రీశంకరాచార్యులు, మధ్వాచార్యులు, భగవద్రామానుజాచార్యులు జగద్గురువుల స్థానంలో నిలిచారు. నిజమైన జ్ఞానము అనే నాణానికి శాంతి సమానతలు ఇరువైపుల పార్శ్వాలు. అలాగే ఆధ్యాత్మిక జ్ఞానానికి భక్తి శరణాగతులే ప్రధానము. ఇటువంటి సమాజ హిత మార్గాలనే “తత్వహిత పురుషార్థాలుగా” ప్రబోధిస్తుంది రామానుజమార్గం! భగవంతుని పొందుటకు భగవదనుగ్రహమే కారణం! భగవదనుగ్రహానికి యోగ్యత స్వప్రయత్నం కానే కాదు! అనన్య శరణత్వమే భగవత్ కృపకు మార్గం! కనుక భగవద్ అనుగ్రహ ప్రాప్తికి అనుసరించే అనుష్ఠానంలో శరణాగతిలో భక్తి భావనానుభవానికి అందరూ యోగ్యులే! జీవులకు ఉండే భగవత్ సంబంధాన్ని శరీర శరీరి సంబంధమనే సత్యాన్ని భగవద్రామానుజాచార్యులు వెలువరించారు. విశిష్టాద్వైత సిద్ధాంత మార్గదర్శనంగా వారు రచించిన నవరత్నాలుగా ప్రసిద్ధమైన గ్రంథాలలో ప్రధానమైనది శ్రీభాష్యము. ఈ సిద్ధాంత గ్రంథాన్ని సంతుష్టాంతరంగయై సాక్షాత్ సరస్వతీ మాత ప్రశంసించినదట.

“లక్ష్మీకాంత పదారవింద యుగళైకాంతా ప్రమేయాద్భుతా ప్రేమాణం శఠగోప సూరిమత తదిత్యబ్ధిమగ్నాశయం శ్రీమద్ భాష్య కృతం యతీంద్ర” అని పెద్దలు స్తుతిస్తారు. అనగా శ్రీనమ్మాళ్వార్ శ్రీసూక్తులనే అమృత సాగరంలో వోలలాడి శ్రియఃపతి పాదారవిందముల నాశ్రయించి శ్రీభాష్యరచన గావించారని భావం. వేద వేద్యుడైన పరమాత్మను భక్తి భావ ప్రకర్షతో తాదాత్మ్యతతో కీర్తించి ప్రత్యక్ష గుణానుభవం

# శ్రీరామానుజ సుధామాధురి




పొందినవారు ఆళ్వార్లు. వారి ద్వారానే వేదసారమైన ద్రావిడ వేదం, ఆవిర్భవించింది. ఆళ్వారుల శ్రీసూక్తులైన ద్రావిడ ప్రబంధ సారాన్ని, పరమఋషులు ప్రతిపాదించిన వేద వేదాంత బ్రహ్మసూత్ర సారాన్ని, పూర్వాచార్య బోధనా జ్ఞానాన్ని సమ్మిళితంగా పరమ సత్యాన్ని వెలువరించి సిద్ధాంతీ కరించారు జగదాచార్యులు. తమ ఆచార్యులైన యామున మునుల ఆజ్ఞననుసరించి బ్రహ్మసూత్రములైన బోధాయన వృత్తి గ్రంథానికి వ్యాఖ్యానముగా శ్రీభాష్యమును రాశారని పెద్దల మాట! వేద మార్గ ప్రతిష్ఠాపనాచార్యులై తత్వ త్రయ నిరూపణం గావించారు. భవిష్యత్తులో ఆచార్యులై అవతరించి. అందరినీ ఉద్ధరించే వారు,ఆత్మోజ్జీవన మార్గంలో నడిపేవారు ఒకరు వస్తారని పూర్వాచార్యులు ముందుగానే చెప్పారు.అది ఒక అద్భుతం! వారు భగవద్రామానుజాచార్య లేనని యామునమునులు నిర్ణయించడం ఆశ్చర్యకరం! యామునాచార్యులు పూర్వాచార్య పరంపరగా వచ్చిన సాంప్రదాయ సంపదను కాపాడిన మహదాచార్యులు. వారి కాంక్షను సాకారం చేయుటకు, భగవద్రామానుజాచార్యులు అవతార ప్రయోజనం పూర్తి చేయుటకు, భావితరాల కోసం సహేతుకమైన స్పష్టమైన ఆధ్యాత్మిక సత్యాన్ని ఆవిష్కరించే కొరకు శ్రీ భాష్య గ్రంథ రచనను కావించారని పెద్దలు విశ్లేషిస్తారు. అనుష్ఠాన అనుసరణల్లో చిరు భేదాలు ఉన్నప్పటికీ దాదాపుగా ఆస్తిక సిద్ధాంతాలన్నీ పరత్వ నిర్ణయంలో శ్రీమన్నారాయణుడే జగత్కారణుడని ఏకీభవిస్తాయి. "సర్వం విష్ణుమయం జగత్" అనే భావిస్తాయి. ఎందరో వాగ్గేయకారులు, భక్తులు శ్రీవైష్ణవాన్ని అనుసరించి తరించారు.

శ్రీభాష్యానికి మూల గ్రంథమయిన "బోధాయన వృత్తి" గ్రంథం కాశ్మీరంలోని పుస్తక భాండాగారంలో వుంది. భగవద్రామానుజాచార్యులు కాశ్మీర దేశానికి శిష్య ప్రశిష్యులతో ప్రయాణమయ్యారు. జగత్ ప్రసిద్ధమైన రామానుజ సిద్ధాంతానికి మూలమైన శ్రీభాష్య రచనకు బీజ భూతమైన పవిత్ర ప్రదేశం కాశ్మీరం! ఆనాటి అవిభాజ్య, అఖండ భారతావనిలోని కాశ్మీర దేశం వేద వాఙ్మయ జ్ఞాన వాహినీ భాండాగారం! ఉత్తర భారతంలో గల కాశ్మీరానికి దక్షిణ భారతదేశంలో నుంచి జగదాచార్యులు వెళ్ళారు. అక్కడి పండితుల అనుమతితో శారదా దేవి అనుగ్రహంతో గ్రంథం కష్టసాధ్యంగా లభించింది. మొదలియాండాన్, కూరత్తాళ్వాన్, అరుళాల పెరుమాళ్ ఎంబెరుమానార్ (పూర్వాశ్రమంలో యజ్ఞమూర్తి) మొదలగు శిష్యులతో అక్కడే ఉండి గ్రంథాధ్యయనం చేశారు. అయితే ముందుగా గ్రంథం ఇచ్చుటకు నిరాకరించినా శారదా దేవి ఆజ్ఞగా పండితులు ఆ గ్రంథాన్ని ఇచ్చారు. కానీ దారిలో కొందరు దాన్ని అపహరించారని మరొక కథనం కూడా ఉంది. భగవద్ రామానుజాచార్యుల శిష్యగణంలో జ్ఞానప్రకాండులు ఎందరో ఉన్నారు. అందులో ప్రధానులు శ్రీవత్సాంకులు (కురేశులు) వారు ఏకసంతాగ్రాహులై వృత్తి గ్రంథాన్ని ధారణ చేశారు. గురువైన భగవద్రామానుజాచార్యులకు శ్రీభాష్య గ్రంథ రచనలో సహకరించారు. కూరేశుల ధారణ శక్తికి, యతిరాజుల శేముషీ వైభవానికి విశేష ప్రతీక శ్రీ భాష్యం! అని ప్రస్తుతిస్తారు. గ్రంథాన్ని "జీవాత్మ లక్షణాన్ని వివరించే

# శ్రీరామానుజ సుధామాధురి

సందర్భంలో జీవుని లక్షణం కేవల జ్ఞాతృత్వం (జ్ఞానము కలిగి ఉండుట) అయినప్పటికీ భగవంతుని ఇష్టానికి వినియోగపడు జ్ఞాతృత్వమే ముఖ్యము". అనే అంశాన్ని నిరూపించడంలో కూరేశులు సహకరించారని ఒక కథనం ఉంది. భగవత్ శేషత్వముతో (భగవంతునికి చెంది వుండుట) కూడుకున్న జ్ఞాతృత్వమే జీవాత్మ లక్షణం అని నిరూపించారు. అందుకే ఆత్మసాక్షాత్కారము కైవల్యము కంటే భగవత్ సారూప్య, సామీప్యములతో కూడిన మోక్షమే ప్రధానము అని పెద్దలు అభివర్ణిస్తారు.



రెండు సంవత్సరముల తర్వాత శ్రీ భాష్య రచనానంతరము యతిరాజులు రెండవసారి కాశ్మీరానికి వెళ్లారు. మూల గ్రంథం కోసం మొదటిసారి. నిర్విఘ్నముగా గ్రంథం పూర్తి చేసి రెండవసారి వెళ్లారు. విద్యాభ్యాస సమయంలోనే గురువు చెప్పే వేదమంత్రాలకు గొప్ప అర్థవ్యాఖ్యానాలు చెప్పిన సమర్థులు యతిరాజులు. వారు చెప్పిన వ్యాఖ్యానానికి సరస్వతీ మాత సంతోషించిందని "శారదా శోకనాశనాయ నమః" అని నామంతో పెద్దలు అష్టోత్తరంలో కీర్తిస్తారు.

పరిపూర్ణమైన శ్రీభాష్య గ్రంథాన్ని దేవతా మూర్తి అయిన శారదా దేవి సన్నిధికి, తెచ్చి అంకితం చేశారు. ఈసారి సరస్వతీ దేవి ఎంతో సంతోషించి యతిరాజులను శ్రీభాష్యకార! అని సంబోధించి పండిత ముఖంగా బిరుదు ప్రదానం చేసింది. స్వయంగా ఆశీర్వదించి హయగ్రీవ స్వామి ఆరాధనా మూర్తిని ప్రసాదించిందట! ఎందరో పండితులచే పరిశీలింపబడి వేనోళ్ళ ప్రశంసించ బడింది శ్రీ భాష్య గ్రంథం. కానీ కొందరు అసూయాపరులైన పండితులు "అభిచారిక హెూమం" అనే కృత్యాన్ని ఆచరించి, కృత్తి అనే దుష్ట శక్తిని పుట్టించి జగదాచార్యులకు అపకారం తలపెట్టారని కథాంశం. 'సకల మంత్రములకు రాజమైన మంత్రరాజ (అష్టాక్షరీ) అనుష్ఠాన పరులకు' ఇటువంటి ఆపదలేవీ దరిచేరవు కనుక తిరిగి అసూయాపరులైన ఎందరో పండితులు పశ్చాత్తాపంతో జగదాచార్యులనే శరణు వేడారని కూడా కథా వైభవం!

ఈ విధంగా ఎన్నో ఒడిదుడుకులను సహించి, శ్రమకోర్చి సర్వ మానవులూ ఉజ్జీవించాలని అందరినీ ఉద్ధరించారు.

భగవదనుగ్రహ సాధనా రూపమగు గొప్ప సిద్ధాంత మార్గాన్ని అందించిన యతివరేణ్యులు శ్రీరామానుజమునులు.

స్వయంగా భగవద్రామానుజాచార్యులు అందరూ తరించుటకు ఆరు తరుణోపాయాలను ప్రతిపాదించారట! అవి 1.శ్రీభాష్య శ్రవణం, 2.ద్రావిడ వేదసారమగు భగవద్ విషయములను వినటం, 3.108 దివ్యదేశముల యొక్క యాత్ర, 4.మేలుకోట, కంచి, శ్రీరంగం వంటి దివ్య దేశాలలో నివాసం ఉండటం, 5.అర్థముతో కూడిన ద్వయ మంత్రానుసంధానం చేయటం, 6.భాగవతుల సేవచేయటం. వీటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పెద్దలు చెప్పారు.

**విశేషాంశం :** సనాతన ధర్మానికి పునర్వైభవం వస్తున్న నేపథ్యంలో ఇటీవల శ్రీనగర్ కాశ్మీరంలో జగద్గురు రామానుజాచార్య సరస్వతీ భాండాగారం (డిజిటల్ లైబ్రరీ) ఏర్పాటు చేశారు. యదుగిరి యతిరాజ (మేల్ కోట) మఠం శాఖ కూడా ఏర్పాటు చేయబడింది "స్టాచ్యూ ఆఫ్ పీస్" భగవద్రామానూజుల వారి (పాలరాతి )శాంతి మూర్తిని ప్రతిష్ఠించారు. అలాగే ఇటీవల శ్రీశంకరాచార్యులు సర్వజ్ఞ పీఠం అధిష్ఠించిన, శారదా దేవి శక్తి స్థలమైన కాశ్మీర్ లోని వివాదాస్పద స్థలం తీత్వాల్ లో సరస్వతి దేవాలయం నిర్మించారు. విధుశేఖర భారతి శంకరాచార్యులు స్వయంగా ప్రతిష్ఠించారు. ★

# మహా శివ రాత్రి - లక్ష్మీజయంతి

ప్రత్యేకం

శివరాత్రి మహా పర్వదినం ఈ శివరాత్రిని మాఘ మాసంలో బహుళపక్షంలోని చతుర్దశినాడు జరుపుకోవడం అనేటువంటిది సంప్రదాయం. బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో శంకరుడు శివుడు సాంభుడు అనే పేర్లతో పిలువబడే పరమేశ్వరుడు మహాశివుడు లింగ రూపంలో అవతరించినటువంటి రోజుగా ఈ శివరాత్రిని పెద్దలు సంభావిస్తారు. ఈ శివరాత్రిని ఏనాడు జరుపుకోవాలి అంటే దానికి ధర్మశాస్త్రాలు చెబుతూ ఉన్నాయి.

"మాఘ మాసస్య శేషేయా ప్రథమే ఫాల్గుణస్య చ

కృష్ణా చతుర్దశీ సా తు శివరాత్రిః ప్రకీర్తితా" అని చెప్తోంది. అంటే ఈ శివరాత్రి మాఘమాసం చిట్టచివరి కృష్ణపక్ష చతుర్దశి నాడు వస్తుంది. చతుర్దశి కాగానే అమావాస్య ఆ తరువాత ఫాల్గుణ మాసం ప్రారంభం అవుతుంది. దాన్ని ఈ శ్లోకంలో చెప్తున్నారు. మాఘమాసంలో కృష్ణ చతుర్దశి మాఘ మాసమునకు చిట్టచివరి మిగిలిన తిథి. ప్రథమే ఫాల్గుణస్యచ ఫాల్గుణానికి ప్రారంభము అంటున్నారు. అమావాస్య తర్వాత ఫాల్గుణమాసం ప్రారంభం అవుతుంది. అయితే ఈ శ్లోకంలో ముఖ్యము గౌణము అని ఒక అర్థం చెప్పుకున్నట్లుగా, దాని యొక్క ప్రాముఖ్యతను చెపుతున్నట్లుగా ఈ శివరాత్రి చాలా పవిత్రమైనది. అని దాని పవిత్రతను చెప్పుటకు ఈ విధంగా చెప్పబడింది. మాఘ మాసానికి శివరాత్రి ప్రధానమైనది. అలాగే ఫాల్గుణమాసానికి కూడా ప్రధానమైనది అని చెప్పుటకు ఈ శ్లోకమందు మాఘమాసంలో మిగిలినటువంటి చిట్టచివరి రోజు చతుర్దశి అని ఫాల్గుణ మాస ప్రథమ మందు అని చెప్పబడినది. ఫాల్గుణ మాసం పాడ్యమి నుండి ప్రారంభ మవుతుంది కాని శివరాత్రి మహాత్యము వలన చతుర్దశి నుండే ఫాల్గుణ మాసం ప్రారంభమైనదిగా భావించవచ్చు. ఫాల్గుణ మాసంలోనే లింగోద్భవం దగ్గరగా ఉన్నది కనుక ఫాల్గుణ మాస ప్రాధాన్యాన్ని ముఖ్య గౌణ పద్ధతులుగా చెప్పబడినది. అనగా మాఘమాసంలో, ఫాల్గుణ మాసంలో కూడా శివుడు ఆవిర్భవించాడు అని చెప్పబడినది.

శివరాత్రి కుండే మహాత్మ్యాన్ని బట్టి లింగ రూపంలో శివుడు ఆవిర్భవించిన ఆరోజును పవిత్రమైన రోజుగా భావించి పరమ శివున్ని ఆరాధించమని చెప్పబడినది. పరమశివునికి ఆరోజు ఎటువంటి సేవ చేసినా చేయకపోయినా ప్రధానంగా



**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి, స్థానాచార్యులు**
శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం

ఉపవాసం ఉండాలి అనేటువంటిది ఇష్టము అని స్కాంధ పురాణం ద్వారా తెలుస్తున్నది. అర్థరాత్రి సమయంలో శివుడు అవతరించాడు అని ఉదయం నుండే శివ పూజ చేస్తూ ఉంటారు. శివరాత్రి నాడు "న స్నానేన న వస్త్రేణ న ధూపేన న చార్చయా తుష్యామి న తథా యథా తత్ర ఉపవాసతః" అని అనగా శివునికి స్నానం చేయడం వలన సంతృప్తి లేదు. అనగా భక్తులు నదీ స్నానాలు, సముద్ర స్నానాలు చేయడం ప్రధానం కాదు. అదే విధంగా శివునికి అభిషేకం చేయడం ప్రధానమే అయినా ఆ మాత్రం చేత శివునికి సంతోషం కలుగదు. శివునికి వస్త్ర సమర్పణం చేసినందువల్ల సంతోషం కలగదు. శివలింగానికి ధూపం సమర్పించడం వలన కూడా సంతోషం ఏర్పడదు. అర్చనలు చేసినా కుదరదు. "తుష్యామి న తథా" ఆమాత్రం చేత సంతోషం ఏర్పడదు. "యథా తత్ర ఉపవాసతః" శివరాత్రి నాడు ఏ భక్తుడైనా ఉపవాసం ఉండడమే శివునికి చాలా ఇష్టమట! అర్చించడం అనేది కూడా ప్రధానమే అయినప్పటికీ ఉపవాసం ఉండడమే శివునికి చాలా ఇష్టము అని స్కాంద పురాణంలో శివుడే

తాను స్వయంగాచెప్పినటువంటి మాట! "ఓ భక్తులారా శివ రాత్రి ఉపవాసం చేయడం వలన నాకు కలిగేటువంటి ప్రీతి, స్నానము వలన వస్త్రాలను సమర్పించడం వలన నాకు ధూపాన్ని సమర్పించడం వలన అలాగే నాకు పుష్పార్చన చేయడం వల్లనో నాకు కలుగదు అని. అనగా అవి వద్దని కాదు ఉపవాసము ప్రధానం. అటువంటి పవిత్రమైన శివరాత్రి రోజు శివుడు లింగ రూపంలో ఉద్భవించి తనకు ఆద్యంతములు లేవు అని నిరూపించిన రోజు. ఇటువంటి ఒక పవిత్రమైన రోజున ఆ శివుని అర్చించడం ఆచారం. శివునికి అర్చన చేసేటప్పుడు కొన్ని నామాలను చెబుతారు. నమశ్శివాయ సాంబాయ, శాంతాయ, పరమాత్మనే అని. నమశ్శివాయ పంచాక్షరి మంత్రం. సాంబాయ అంబతో కూడినవాడు పరమ శాంతమూర్తి అని ఈ నామాలను వేదం కూడా కీర్తిస్తుంది. "నమ స్సోమాయచ రుద్రాయచ నమస్తాంమ్రాయ చ బుణాయచ" ప్రారంభంలోనే నమస్ సోమాయ చ అని ప్రారంభిస్తుంది వేద మంత్రం. ఉమయా సహ వర్తత ఇది సోమ అనగా పార్వతీదేవితో కూడి ఉంటాడు కనుక సోముడు అని పరమశివుని పేరు. పార్వతీతో కూడి ఉండడం పరమశివునికి ప్రీతి అని శివరాత్రి నాడు పార్వతితో కూడి ఉన్న శివుణ్ణి పూజించడం, శాంతమూర్తి అనే భావనతో అర్చించడం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తూ ఉండడం అనేది ప్రధానము అని మహాశివరాత్రి నాడు పరమశివుని పూజించమని మనకు పురాణాలు చెబుతున్నాయి.

**భక్తులు నదీ స్నానాలు, సముద్ర స్నానాలు చేయడం ప్రధానం కాదు. అదే విధంగా శివునికి అభిషేకం చేయడం ప్రధానమే అయినా ఆ మాత్రం చేత శివునికి సంతోషం కలుగదు.**

**"యథా తత్ర ఉపవాసతః" శివరాత్రి నాడు ఏ భక్తుడైనా ఉపవాసం ఉండడమే శివునికి చాలా ఇష్టమట!**

అటువంటి మహాత్మ్యము కలిగిన రోజు మహాశివరాత్రి. "శైవోవా వైష్ణవో వాపి యోన్య పూజతః సర్వంఫలం హంతి" అన్ని ఫలాలు ఏర్పడాలంటే శివరాత్రి శైవులైనా వైష్ణవులైనా మరి ఎవరైనా ఇంకో దేవతను పూజించకుండా శివరాత్రి రోజు శివుడిని పూజించాలి అని స్కాంద పురాణంలో చెప్పబడింది. వారి వారి భావనలలో శైవులు అయితే ఆయనే ప్రధాన దైవముగా పరమేశ్వరుడు అని పూజిస్తారు. వైష్ణవులైతే పరమశివుని మహావిష్ణువు యొక్క భక్తాగ్రేసరుడుగా భావిస్తారు. ఎందుకంటే మహాభాగవతంలో "వైష్ణవానాం యథా శంభుః" అని చెప్పబడింది. వైష్ణవులలో పరమశివుడు చాలా ముఖ్యుడు అని విష్ణు భక్తులలో ఆయన గొప్పవాడు అని భావిస్తారు. ఎవరైనా పరమశివుని అనుగ్రహంతో భక్తిముక్తులను పొందవచ్చు అని మహాశివరాత్రి తెలియజేస్తుంది. మాఘ కృష్ణ చతుర్దశి నాడు అందరూ పూజించే మహా శివరాత్రి ఏర్పడుతున్నది. మాఘ కృష్ణ చతుర్దశికి శివ చతుర్దశి అని కూడా పేరు ఉంది.

**మహాలక్ష్మి అమ్మవారి అవతరణ**

అదేవిధంగా ఉత్తరా నక్షత్రం కలిగిన ఫాల్గుణ పూర్ణిమ రోజు లక్ష్మీ అమ్మవారు అవతరించిన రోజు. పరమశివుడు అవతరించిన మాసమునకు తరవాతి మాసములో అమ్మవారు అవతరించడం విశేషంగా చెబుతారు. పరమశివుడు ఎలాగైతే బిల్వపత్రములకు సంతోషిస్తాడో అమ్మవారికి కూడా బిల్వపత్రములంటే చాలా ప్రీతికరమట! అందుకనే అమ్మవారి నామాల్లో "బిల్వ నిలయాయై నమః" అని ఉంటుంది. మారేడు దళములతో శివుని పూజించినట్లుగా అమ్మవారిని పూజించడం ఒక సంప్రదాయం. విశ్వరూపుడైనటువంటి పరమాత్మ యొక్క వక్షస్థలంలో అమ్మవారు ఎలా కొలువుతీరి ఉంటుందో. పరమశివుడు కూడా అలాగే ఆయన వక్షస్థలంలో ఉంటాడు అని మనకు విశ్వరూప అధ్యాయంలో భగవద్గీత ద్వారా తెలుస్తుంది. "బ్రహ్మాణ మీశం కమలాసనస్థం" అంటూ అర్జునుడు విశ్వరూపధారి అయినటువంటి కృష్ణ పరమాత్మను చూసినప్పుడు "స్వామి! నీ హృదయ కమలం లో ఈశ్వరుణ్ణి బ్రహ్మదేవుణ్ణి చూస్తున్నాను" అంటాడు. అమ్మవారు అవతరించిన ఫాల్గుణ పూర్ణిమనాడు లక్ష్మీ జయంతిని చేసుకుంటాము. మార్చి 25వ తారీఖు ఈ ఫాల్గుణ పూర్ణిమ లక్ష్మీ జయంతి వస్తుంది. మార్చి నెలలో వచ్చే మహా శివరాత్రిని మరియు లక్ష్మీ జయంతిని జరుపుకొని భగవంతుని అనుగ్రహానికి పాత్రులము అవుతాము.

# శ్రీపతి స్తుతి - సుభాషితం


## మంచి మాట

ప్రాతర్నిత్యానుసంధానంలో

'పంచాయుధ స్తోత్రము'

**శ్లో॥ జలే రక్షతు వారాహః, స్థలే రక్షతు వామనః।**
**అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతు కేశవః॥**

తాత్పర్యం: శ్రీమహా విష్ణువు మహా ప్రళయోదకంలో ఎక్కడో అండకటాహ భిత్తిలో మునిగిపోయి నీటిలో చాలకాలము కదలిక లేక వున్న వస్తువు పైన పాచి పట్టుతుంది. అట్టిస్థితిలో వుంది భూమి. మనందరికీ ఆశ్రయమైనది. మహా భాగవతంలో బ్రహ్మ సృష్టి చేయుటకై ఒక మిథునమును సృష్టించినాడు. 'స్వాయంభువ మనువు', 'శతరూప' అనే దంపతులు వారు. వారిని సృష్టి చేయుమన్నారు బ్రహ్మ. పుట్టిన వాళ్ళకి భూమిలేదు. ఎక్కడ వారి నివాసం? అన్నారు వాళ్ళు. బ్రహ్మ 'నిజమే! భూమి నీటిలో మునిగియుంది గదా! అని కన్నులు మూసుకొని పరమాత్మను ధ్యానించుచుండగా బ్రహ్మనాసిక నుండి 'వరాహతోకము' వెడలినది. వెంటనే బ్రహ్మాండమంత పెరిగి సముద్రంలో మునిగి భూమిని వెదకి తన కోరలపై ఎత్తి నీటిపై నిలిపినాడు. హిరణ్యాక్షుని గూడా సంహరించినాడు. కాబట్టి నీటమునిగిన భూమిని ఉద్ధరించినట్లే నీటిలో నున్న మనలను వరాహమూర్తి రక్షించుగాక అని ప్రార్థన. ఇక భూమి మీద గదా! మనం ఉండేది? అప్పుడు రక్షించేది వామనుడు. ఏమిటి వామనునకు రక్షించే సామర్థ్యం? అంటారా? వినండి. ఇంద్రుని జయించి ముల్లోకాలను పాలిస్తాడు బలి చక్రవర్తి. ఆయన నుండి లోకాలను యాచించుటకై మూడు అడుగులు ఇమ్మన్నాడు వామనుడు. సరే! అన్నాడు బలి. అప్పుడు త్రివిక్రముడై వామనుడు తన ఒక పాదం చేత భూమినంతను ఆక్రమించుకున్నాడు. తనది అని కొలిచినాడన్నమాట. అంటే చరాచరాత్మకమైన ఈ స్థలమంతా ఆయనదే గదా! ఆయన ఆధీనంలోనున్న భూమి మీద మనల్ని 'రక్షించాలి' అంటే ఆయనే! అందుకే 'స్థలేరక్షతు వామనః' అన్నారు. పోతే అడవులలో ఎవరు రక్షకులు? అంటే నృసింహస్వామి. అడవికి రాజు ఎవరు? సింహము. ఎవరిచ్చారు దానికి ఆ అధికారం? అంటే స్వయంగా సంపాదించుకుంది. సింహం అంటే మృగరాజు. అడవులు, కొండలు, గుహలు అన్ని సింహమునకు స్వాధీనం. అందుకే నృసింహస్వామి అహోబిలం, సింహాచలం, యాదాద్రి, ఘటికాచలం మొదలైన పర్వత గుహలలో వేంచేసి వుంటాడు స్వామి. సర్వాంతర్యామిత్వాన్ని, తన శిష్యుని వాక్యమును, ఆశ్రిత రక్షణ, దుష్టశిక్షణ మున్నగు వాటినన్నింటిని 'సత్యం' చేయుటకై అవతరించిన మహానుభావుడు 'మృగోనభీమః' అన్నట్లు 'శీతత్తోడరుళ్‌పెత్త' అన్నట్లు 'నారసింహవపుః శ్రీమాన్' అన్నట్లు శతృభయంకరుడు, మిత్రులకు అభయంకరుడు. కంఠం వరకు నరరూపంతో మొట్ట మొదట కృత యుగంలో అవతరించిన స్వామి. తర్వాత యుగాలలో వచ్చిన రామ, కృష్ణులకు ఉపమానంగా గొప్పగా చెప్పుకోగలగడమే గాక అర్చావతార మూల కందమైన శ్రీరంగనాథునకు గూడా పోల్చి చెప్పుకోగలిగిన అద్భుత రూపుడు నారసింహుడు. **రంగేంద్ర సింహ ముపాస్మహే!**



**శ్రీమాన్ శ్రీ అమరవాది**
**వేంకటనరసింహాచార్యులు**

వరాహస్వామి, వామనమూర్తి, నృసింహుడు ఒక్కొక్క చోటికి రక్షకులు. మరి అన్ని దిక్కులకు,

# శ్రీపతి స్తుతి సుభాషితం

అంతట అన్ని అవస్థలలో రక్షకులు ఎవరు ? అంటే కేశవుడు. ఏమిటీ కేశవుని గొప్ప? 'క' అంటే బ్రహ్మ 'ఈశ' అంటే శివుడు. వీరిరువురు శ్రీమన్నారాయణుని నుంచి వచ్చిన వారు. సృష్టి సంహార కర్తలు. ఇది కేశవ అనే పదానికి ప్రధానమైన అర్థం. 'కేశి' అనే' గుఱ్ఱం రూపంలో వచ్చిన రాక్షసుని సంహరించినవాడు అని మరో అర్థం. ఇవి కాక మరొక అందమైన అర్థం గొప్పగా ప్రకాశించే కేశ సంపద గల వాడని.

అంతటి మహా మహిమగల కేశవుడు 'సర్వతః పాతు' అన్నారు. ప్రధానమైన 24 మొదటి నామాలలో, ఆచమనంలో మొదట వుండేది 'కేశవ' నామమే! 'ఓం కేశవాయనమః' అని. కేశవాయ స్వాహా అనిగదా మనం సంధ్యావందనాది భగవదారాధానాదులలో వాడుకుంటున్నాము. అందుకే కేశవుడు రక్షించుగాక అని. బంధువులారా! భాగవతోత్తములారా! ఒక మనవి మీతో. ఈ స్తోత్రములకు ఇంత వివరణ వ్రాయవలసిన అవశ్యం లేదు. కాని ఈ కాలంలో మనకు ప్రాచీనమైన విజ్ఞానం మరుగున పడిపోవద్దు. జిజ్ఞాసులైన ఆస్తికలోకమునకు ప్రత్యేకంగా పురాణాలు, వేదాలు, శాస్త్రాలు చదివే సమయము. అర్థం చేసుకొనే సామర్థ్యం తక్కువ. కాబట్టి ఉన్నంతలో కొంతలో కొంతైనా తెలియడం కోసం రాయడం జరిగింది. ఇది నాస్వంత ప్రజ్ఞ కాదు. పూర్వీకుల శ్రీసూక్తులు, వారి వ్యాఖ్యాన గ్రంథాలలోని విషయాలు, మాకు ఆచార్యులైన శ్రీ ఉ.వే శ్రీమాన్ శిరిశినహళ్ కృష్ణమాచార్య శతావధాని గారు (కరీంనగర్ లోని కోరుట్ల నివాసులు) శ్రీ ఉ.వే శ్రీమాన్ సాతులూరి గోపాలకృష్ణమాచార్యుల గారి వ్యాఖ్యాన విశేషాలే ఇక్కడ వ్రాయడం జరిగింది. ఇకముందు గూడా.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ వైభవమ్



-డాక్టర్ శేషం వేణుగోపాల శర్మ

మ.కో.

చెన్నకేశవుచేరిమ్రొక్కినచింతలన్నియుతొల్గు,నా
పన్నరక్షకుడాశుభంకరుపాపదూరుడుపృథ్విలో
పన్నగారియెవాహనంబగు పాంచజన్యుడు శ్రీపతీ
సన్నుతించినసమ్మతించునుసాధురక్షకు శ్రీహరీ.. (1)

మ.కో.

దుష్టశిక్షకుకేశవాఖ్యుడుతోడునిల్చును భక్తుకున్
శిష్టరక్షకుడాతడిద్దరి శ్రేయమిచ్చును నుర్విలో
పుష్టిగూర్చునుభక్తుడెందముపూర్ణభక్తియు ప్రీతితో
కష్టకాలమునందుగొల్చిన కాంక్ష దీర్చునునొప్పుగా.. (2)

శా..

దేవాశ్రీహరి భక్తపాలభువిలో దీపించు నారాయణా
నీవేభక్తులకెల్లవేళలిలలో నిష్టన్
గూర్చుసద్భక్తి,నో
దేవాకేశవ కంసమర్ధనఘా
దివ్యార్చితామాధవా
రావాదర్శనమందజేయనెపుడున్ రావేరమావల్లభా.. (3)

ఉ..

పాపముజేయు చింతనల పార గజేయుము పాపసంహరా
యోపరమేశ్వరాసుగుణ యో మునివందిత యోదయార్ణవా
నీపదపద్మశోభలను నీగుణ గానపు దివ్యదీప్తులన్
పంపుశుభంకరావరద పన్నగశా యివిచెన్నకేశవా.. (4)

సర్వలఘు కం.

కరివరద శుభములిడు మిక
వరముల నిటునొసగుమనుచు వసుధను హరినీ
మరువకుమని నడుగగ నటు
యరిగితి సిరిధవునికడకు నతి వినయముతోన్...(5)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

## భూపరీక్షా క్రమము



**శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి**

శ్రీమతే రామానుజాయనమః

భూపరీక్షా క్రమము గూర్చి తెలుసుకుందాం!

**శ్లో॥ వర్ణగంధ రసాకార దిక్శబ్ద స్పర్శనైరపి।**
**పరీక్ష్యైవం యధాయోగ్యం గృహీతావధి నిశ్చితా॥**

గృహము నిర్మించు యజమాని తాను గృహము నిర్మించనున్న భూమి హద్దులు సరిగా ఏర్పరచి ఆ స్థలమును వర్ణము, గంధము, రసము, ఆకారము, దిక్కు, శబ్దము స్పర్శ మొదలగు లక్షణముల చేత యజమానికి యోగ్యముగా నుండునట్లు పరీక్షించు కొనవలయును. (మయమతము)

**శ్లో॥ ఆకార వర్ణ గంధాంశ్చ రూపశబ్ద రసస్పర్శః।**
**ఏతాన్పరీక్ష్య క్రమశః సాభూమిర్మాన నిశ్చయాః।**
**(మానసారము)**

వర్ణపరీక్ష గూర్చి తెలుసుకుందాం!

**శ్లో॥ శుక్లమృత్స్నాచ యాభూమి ర్బ్రాహ్మణా సాప్రకీర్తితా।**
**క్షత్రియా రక్త మృత్స్నాచ హరిద్వైశ్యా ఉదాహృతా।**
**కృష్ణా భూమిర్భవేచ్ఛూద్రా చతుర్థా పరికీర్తితా॥**

గృహము నిర్మించాలనుకున్న యజమాని తాను నిర్మించు స్థల మందలి మృత్తిక వర్ణము ననుసరించి (రంగు) జాతులను నిర్ణయించ వలయును. ఎట్లా నిర్ణయించాలో తెలుసుకుందాం!

భూమి యందలి మృత్తిక శ్వేత అనగా తెలుపు వర్ణముగా నున్నచో బ్రాహ్మణ భూమి యనియు, మృత్తిక రక్త అనగా ఎఱుపు వర్ణముగా నున్నచో క్షత్రియ భూమియనియు మృత్తిక పీత అనగా పసుపు వర్ణముగా నున్నచో వైశ్య భూమియనియు మృత్తిక కృష్ణ అనగా నలుపు వర్ణముగా నున్న శూద్ర భూమి యని నిర్ణయించవలయును.

గంధ పరీక్ష గూర్చి తెలుసుకుందాం!

**శ్లో॥ సుగంధా బ్రాహ్మణీ భూమిః రక్తగంధా తు క్షత్రియా।**
**మధుగంధా భవేద్వైశ్యా మద్య గంధాచ శూద్రిణీ॥**

గృహము నిర్మించనున్న భూమి యందలి మృత్తిక వాసన ననుసరించి జాతులను నిర్ణయించ వలయును. ఎలా నిర్ణయించాలి? భూమి యందలి మృత్తికను తీసుకొని వాసన చూచిన జాజి సురపొన్న మొదలగు పుష్పముల సువాసన కల్గియున్న భూమి బాహ్మణ భూమి యనియు, రక్తపువాసనతో సమానమయిన వాసనలతో కల్గియున్న భూమి క్షత్రియ భూమి యనియు (మధు) తేనే వాసనతో కల్గియున్న భూమి వైశ్యభూమి యనియు, మద్యము (కల్లు)తో సమానమగు వాసన కల్గియున్న భూమి శూద్ర భూమియని నిర్ణయించ వలయును. భూమి యొక్క గంధము ననుసరించి (వాసన) జాతులను నిర్ణయించడములలో భిన్నాభిప్రాయములున్నవి. వాటి ప్రామాణికత ననుసరించి యోగ్యమైన సుగంధముగల భూమి శ్రేష్ఠ మయినదని దుర్గంధము గల భూమి నింద్య మయినదని నిర్ణయించవలయును.

రసపరీక్ష గూర్చి తెలుసుకుందాం !

**శ్లో॥ మధురా బ్రాహ్మణీ భూమిః కషాయా క్షత్రియామతా।**
**అమ్లావైశ్యా భవేద్భూమి స్తిక్తా శూద్రా ప్రకీర్తితాః॥**



# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

మృత్తిక యొక్క రసము (రుచి) ననుసరించి భూమి యొక్క జాతులను నిర్మయించ వలసియున్నది. ఎట్లా చూడాలో తెలుసుకుందాం! భూమి యందలి మృత్తికను నాలుకపై వేసుకొని చప్పరించిన యెడల మధురముగ (తీపి) నున్నచో బ్రాహ్మణ భూమి యనియు, కషాయముగ (వగరు) నున్నచో క్షత్రియ భూమి యనియు, పులుపుగ (ఆమ్లము) నున్నచో వైశ్యభూమియనియు, చేదుగ (తిక్తము) నున్నచో శూద్ర భూమియని తెలిసి కొనవలయును.

ఆకార పరీక్ష గూర్చి తెలుసుకుందాం!

**శ్లో।। గంభీరా బ్రాహ్మణీ భూమిః నృపాణాం తుంగమాశ్రితా।।**

**వైశ్యాసా సమభూమిశ్చ శూద్రిణీ వికటాస్మృతా।।**

భూమి ఆకారము ననుసరించి జాతులను నిర్ణయింపవలసి యుండును. ఎలా నిర్ణయించాలో తెలుసుకుందాం! గృహము నిర్మించాలనుకున్న స్థలము (భూమి) ఆకారము గంభీరముగా వున్న బ్రాహ్మణ భూమి యనియు. తుంగము (ఎత్తు)గా వున్న క్షత్రియ భూమి యనియు, యెత్తు పల్లములు లేకుండ సమానముగా నున్న వైశ్య భూమి యనియు, వికటముగా నున్న శూద్ర భూమి యని తెలుసుకొనవలయును. దక్షిణము పల్లముగా వున్న భూమి వైశ్య భూమియని, పశ్చిమము పల్లముగా వున్న శూద్ర భూమియని తెలిసికొని నిర్ణయించ వలయును.

భూమి యొక్క జాతి ఫలము

**శ్లో।। బ్రాహ్మణీ సర్వసుఖదా క్షత్రియా రాజ్యదా భవేత్।**

**ధన ధాన్యకరీ వైశ్యా శూద్రాతు నిందితాస్మృతా।।**

మనకు ఆచార్యులనుగ్రహించిన 'చత్వారో వర్ణాః' బ్రాహ్మణ, క్షత్రియా, వైశ్యా శూద్రా అను నాల్గు జాతుల భూములలో బ్రాహ్మణ భూమి సమస్త సుఖములను కలుగ చేయును, క్షత్రియ భూమి రాజ్య ప్రదముగా నుండును. వైశ్యభూమి ధనధాన్యాదుల నొసంగును. శూద్ర భూమి నింద్యము అనగా కష్టములను నష్టములను కల్గించును.

# శ్రీలక్ష్మీ సమేత యోగానంద, ఉగ్ర నృసింహస్వామి శ్రీవేంకటేశ్వరస్వామి వారల బ్రహ్మోత్సవములు



శ్రీలక్ష్మీ సమేత యోగానంద, ఉగ్ర నృసింహస్వామి మరియు శ్రీవేంకటేశ్వరస్వామి వారల బ్రహ్మోత్సవములు ఫాల్గుణ శుద్ధ ఏకాదశి తేదీ 20-03-2024 బుధవారం నుండి 01-04-2024 సోమవారం వరకు జరుగుతాయి. 21న కళ్యాణం, 24 నుండి 26 వరకు డోలోత్సవం, తెప్పోత్సవం, 29న రథోత్సవం, 30 నుండి 01-04-24 వరకు ఏకాంతోత్సవములతో కార్యక్రమములు జరుగుతాయి.

# యజ్ఞములు-లోకహితాలు

భక్త మహాశయులారా! భగవంతుని అపారమైన కరుణతో మనమంతా ఈ వేద భూమిలో పుట్టాము. ప్రపంచంలో ఆధ్యాత్మిక దివ్య విజ్ఞాన రహస్యములు వేదములు గదా! ఆ దివ్య వేదములన్నీ సాక్షాత్ హరి స్వరూపాలు. వేదములన్నీ విశ్వశాంతిని ప్రసాదిస్తాయి.

వీటి రచన ఎవరూ చేయలేదు. అసలు ఎంత కాలం నుంచి మన భారత దేశంలో ఉన్నాయో ఎవ్వరూ చెప్పలేదు, కేవలం సంకుచిత బుద్ధితో వేదరచనా కాలం చెప్పే పాశ్చాత్యుల అభిప్రాయాలన్ని ఏమాత్రం అంగీకరించబడవు.

"ఓం శాంతిః శాంతిః శాంతిః" అంటూ ఈ చరాచర సృష్టికే కాదు సమస్త అండ పిండ బ్రహ్మాండాలన్నీ ఆధ్యాత్మిక ఆదిభౌతిక ఆదిదైవిక శాంతితో ఉండాలని కోరడం మాత్రమే కాదు. శాంతి ఎలా పొందగలమో కూడా విప్పిచెప్పింది. అందులోనూ ముఖ్యంగా వేదములు, "యజ్ఞములే "గొప్ప ఉపాయములు అని స్పష్టంగా చాటింది. "యజ్ఞము" అంటే దేవతలను ఆరాధించడము. అని అర్థము. విగ్రహారాధన, యంత్రములలో ఆరాధించుట, కుండములో అగ్నికి నేయి సమర్పించుచూ ఆయా దేవతలను ఆరాధించుట అనునది ప్రాచీన సంప్రదాయము. "అగ్నిముఖావై దేవాః" దేవత లందరూ అగ్ని ద్వారానే తమకు సమర్పించిన వాటిని స్వీకరిస్తారు అని మహర్షులు చెప్పారు. అగ్నిని జమ్మికర్ర ద్వారా (ఆరణీ) రాపిడితో చిలికి సాధిస్తారు. లేదా సూర్య రశ్మిని భూతద్దంపై పడునట్లు చేసి అగ్నిని సాధిస్తారు. శాస్త్ర వచనాలను అనుసరించి యజ్ఞకుండ నిర్మాణాలు వివిధ ఆకారాలలో నిర్మిస్తారు. ఎన్ని ఇటుకలతో ఎలా నిర్మించాలో కూడా చెప్పబడింది. చతురస్ర, వృత్త, అర్థచంద్ర మొదలగు ఆకారాలతో 'కుండ' నిర్మాణం చేస్తారు. ప్రతి కుండానికి ఒకరు లేదా నలుగురు ఋత్వికులు, హోతా, పోతా, నేతా, ఉద్గాతా అనే పేర్లతో ఆరాధిస్తారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ఎంతో పవిత్రంగా సిద్ధం చేసుకొంటారు. హోమ కుండాల చుట్టూ రంగవల్లులు ముగ్గులు వేస్తారు. పుష్పాలతో అలంకరిస్తారు. దగ్గరలో 'చరు పాత్రలు' సుక్ స్రువాలు నేతిని, గ్రహించడానికి ఉపయోగిస్తారు. కావలసిన, నమిధలు అంటే హోమంలో ఉపయోగించే కట్టెపుల్లలు రావి, మోదుగ మొదలగునవి ఇంకా వివిధ సుగంధ ద్రవ్యాలు, పిండి, పేలాలు, ఆయా సందర్భాలలో ఉపయోగిస్తారు. వీటిని



శ్రీమాన్ శ్రీ డా. ఎమ్. టి. ఆళ్వార్, తాడేపల్లి

అన్నిటిని సక్రమంగా ఉన్నాయో అని గమనించ డానికి ఒక "బ్రహ్మ" పర్యవేక్షకుడు ఉంటాడు. భార్యాసమేతుడైన గృహస్థులు స్వాహా కారాలతో అగ్నిలో నేయి సమర్పిస్తారు. ముఖ్యంగా యజ్ఞవేదిక చుట్టూ దర్భలు పరిస్తరణగా ఉంచుతారు. ఇదంతా చక్కని చతుష్పాత్ ప్రయోగాలలో వివరించబడి ఉంది. యజ్ఞం జరిగే స్థలంలో వివిధ దిక్కులలో శాస్త్రానుసారం ఉంచిన వేదికలో కలశాలు స్థాపన చేస్తారు. ఎవరూ పిలవకుండానే యజ్ఞాన్ని దర్శించు కోవాలని శాస్త్రం చెపుతోంది. సకల దేవతలు యజ్ఞస్థల వాటికలో ఉంటారు. అందుకనే ఎంతో పవిత్రంగా ఉండాలి. సంకల్పం బట్టి ఏ హోమ గుండంలో ఎంత మంది ఏయే మంత్రాలను ఉపయోగిస్తారో ఆయా విధానాలు ఎన్నో స్మృతులలో చెప్పారు. బ్రహ్మచారి సమిధా దానం రెండు సంధ్యలలో చేయాలి. గృహస్థులు కూడా వారికి తగిన యజ్ఞాలు చేస్తారు. ఇవి నిత్యం, నైమిత్తికం అని ఆయా సందర్భాలలో వివిధయజ్ఞాలు చేస్తారు. మనయిండ్లలో దీపారాధన అంటేనే యజ్ఞరూపము నకు ప్రతిరూపము. దేవాలయాలలో విశేషంగా నిత్యాగ్ని హోత్రములు ఉంటాయి. వీటిని ఆయా ఆగమాలు చెపుతాయి. యజ్ఞముల గురించి శ్రీమద్భగవద్గీతలో ఎలా

# యజ్ఞములు-లోకహితాలు

వివరించారో గమనించుదాం! శ్రీభగవానువాచ

**కాంక్షన్తః కర్మణాం సిద్ధిం యజన్త ఇహ దేవతాః**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిః భవతి కర్మజా** (అ 4 శ్లో12.)

ఈలోకంలోని ప్రజలు తమకోర్కెలను సాధించుకొనుటకై దేవతలను యజ్ఞములతో ఆరాధించి శీఘ్రముగా ఫలితాలను పొందుచున్నారు.

**దైవమేవా పరే యజ్ఞం యోగినః పర్యుపాసతే**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతీ** (అ.4 శ్లో 25)

కొందరు యోగులు యజ్ఞములద్వారా దేవతలను బాగుగా పూజింతురు. మరికొందరు పరబ్రహ్మమనెడి అగ్నిలో హోమములు చేయుదురు. బ్రహ్మచారులు, గృహస్థులు దివ్యఫలములను పొందుచున్నారు. వీరంతా పాపముల నుండి శుద్ధులై

**సర్వేప్యేతే యజ్ఞవిదో యజ్ఞ క్షపిత కల్మషాః।**
**యజ్ఞ శిష్టామృత భుజో యాన్తి బ్రహ్మ సనాతనమ్॥**

యజ్ఞఫలము అమృతమే. దానిని ఆస్వాదించినవారే సనాతన ధామానికి చేరుకొనగలరు. యజ్ఞ ప్రసాదము అన్నిటికన్నా చాల పవిత్రము. శీఘ్ర ఫలము ఇచ్చునని తెలియుచున్నది. యజ్ఞములన్ని వేదాలచే ఆమోదించబడినవి. వివిధ కర్మల నుండి పుట్టినవి. వాటిని తెలుసుకోవడమే ముక్తికి మార్గము. దేహధారుల హృదయములో పరమాత్మ రూపములో ఉండెడివాడు అధియజ్ఞుడు, ఆ శ్రీహరి అని తెలుసుకొనవలెను.

**అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్।**
**మన్త్రోహమహమేవాజ్యం అహ మగ్ని రహం హుతమ్॥**

వైదికయజ్ఞము, జ్యోతిష్టోమము, స్మృతులలో చెప్పిన మహాయజ్ఞము, పితృలోకాలకు సమర్పించు యజ్ఞములు కూడా ఆశ్రీహరి రూపములే.

**అహం హి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ** నిజానికి సమస్తయజ్ఞములు అనుభవించి, అధికారిగా ఉన్నవాడు ఆ పరంధాముడే అతడే యజ్ఞ భగవానుడు. యజ్ఞములు ఎంతటి లోకోపకారముగా మారునో ఈ క్రింది గీతావాక్యములను పరిశీలించగలరు.

**అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సంభవః।**
**యజ్ఞాత్ భవతి పర్జన్యః యజ్ఞః కర్మ సముద్భవః॥**
(అ 3శ్లో 14)

భౌతిక శరీరాలన్నీ (ధాన్యము, అన్నము వలన) ఆహారము వలన పెరుగుచున్నవి. ఆహారధాన్యాలు పర్జన్యుని (వర్షాధి దేవత) అనుగ్రహముతో వృద్ధి చెందుచున్నవి. ఆవర్షములన్నీ యజ్ఞములు సక్రమముగా చేసినచో అద్భుతముగా కురియును. “వానాలు కురవాలి వానదేవుడా! వరిచేలు పండాలి వానదేవుడా!” పాటలోని అంతరార్థమిదే. మనదేశములో కరువు కాటకములు వచ్చిన సమయములో వివిధ పీఠాధిపతులు ప్రజలచే యజ్ఞములు చేయించి వర్షములను కురిపించిన సంగతి అందరికీ తెలిసినదే! “వరుణ యజ్ఞము, విరాట పర్వపారాయణము. రుద్రాభిషేకములు, సుందరకాండ పారాయణములు” ఈ యజ్ఞ భాగములే. పవిత్ర కర్మలన్నిటినీ వేదములు నిర్దేశించినవి. ఆవేదములు భగవానుని ముఖారవిందము నుండి వ్యక్తమైనవి. ఆ పరబ్రహ్మము యజ్ఞనారాయణుడు. అశ్వమేధము, నరమేధము, మహామేధము, విశ్వజిత్ యాగము ఇవి దేశసార్వభౌమ చక్రవర్తులు ఆయా యుగాలలో చేసి అద్భుతపరిపాలన అందించారు. ఇప్పటి కాలములో కూడా కొందరు మహాత్ములు, పెద్దలు దేశ కాల మాన స్థితుల బట్టి వ్యక్తిగత సామూహిక, వైదిక క్రతువులను చేయించుచూ విశ్వశాంతిని కాపాడుచునే ఉన్నారు. ఎక్కడ యజ్ఞము జరిగినా అక్కడ సమస్త నదులు. వేదపండితులు, ప్రవచనకారులు, పుణ్యస్త్రీలు, గోవులు, దేవతాగణములు, మంత్రములు వ్యాపించి ఉందురు. కాబట్టి యజ్ఞము జరుగుస్థలము తెలిసి కొని వెళ్ళి దర్శించుకొను బాధ్యత మానవునిదే! **అనాహూతః అధ్వరం గచ్ఛేత్** ఆహ్వానము లేకున్నా వెళ్ళ దగిన స్థానము యజ్ఞభూమియే! అక్కడ హోమముల నుండి వెలువడిన ధూమము మహాశక్తివంతము. సౌభాగ్య ప్రదము, సంతాన ఫలప్రదము, దారిద్య ధ్వంసనము, దుఃఖవిదూరము, ఆయుర్వృద్ధి, పరమశాంతిని కలిగించునని మన హిందూ పవిత్ర గ్రంథములన్నీ చాటినవి. “యజ్ఞవాటికకు కావలసిన సమిధలు, కుశలు, పుష్పములు నేయి, సుగంధ ద్రవ్యములు యథాశక్తి సమర్పించుటయే మానవ జన్మకు ఒక గొప్ప సార్థకత అని పెద్దల మాట!”

**మంచి పనులన్నీ యజ్ఞములే! పరోపకారములు యజ్ఞములే! దేవతార్చనలు యజ్ఞములే! త్రికరణ శుద్ధిగ జీవనము గడుపుట మహాయజ్ఞమే!**

**గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం।**
**లోకాస్సమస్తాః సుఖినో భవంతు॥**

# శాస్త్రజ్ఞానము ద్వారా భగవత్ వైభవం తెలుస్తుందా...

**శ్రీమాన్ శ్రీ డా.వోలేటి రవికుమారాచార్యులు**



**భ**గవంతుని యొక్క వైభవము తెలియాలంటే బాగా శాస్త్రములు చదివినవారై ఉండాలి. అట్టి వారికి మాత్రమే ఆ పరమాత్మ యొక్క వైభవం తెలుస్తుంది అని చాలామంది భావిస్తూ ఉంటారు. అయితే, కేవల శాస్త్రజన్య (శాస్త్రము ద్వారా లభించిన) జ్ఞానము భగవత్ వైభవాన్ని యథాతథంగా తెలియుటకు ఉపకరిస్తుందా లేదా ఇతర ప్రత్యేకమైన లక్షణములు ఉండాలా అనే విషయాన్ని పంచమ వేదము అని పిలువబడే శ్రీమహాభారతములోని ఉద్యోగ పర్వము నందు కల ఒక ఘట్టము ద్వారా తెలుసుకునే ప్రయత్నము చేద్దాము.

భారతయుద్ధము జరుగుటకు ముందు పాండవులను మరియు శ్రీకృష్ణుని కలిసి వచ్చిన సంజయుడి ద్వారా అక్కడి విశేషాలను వినగోరుతాడు ధృతరాష్ట్రుడు.

ఆ సమయంలో వ్యాసుడు గాంధారి కూడా అక్కడ ఆసీనులై ఉంటారు. సంజయుడు భగవానుడైన శ్రీకృష్ణుని గురించి చెప్పిన అనేక వైభవములను గూర్చి విన్నాక, ధృతరాష్ట్రుడు ఒక ప్రశ్న వేశాడు. ఓ సంజయా, శ్రీకృష్ణుడు సర్వలోకేశ్వరుడు అని నీకు ఎలా తెలుసును? నువ్వు నేను ఒకేసారి శాస్త్రమును అధ్యయనము చేసాము కదా. చదివిన శాస్త్రంలో నీవు ఎక్కువ నేను తక్కువ చదివింది ఏదీ లేదు. అలాంటపుడు రాజునైన నాకు చెప్పగలిగే అంతగా నీకు ఈ విషయాలు ఇంత స్పష్టముగా ఎలా తెలిశాయి? అని అడుగగా సంజయుడు చెప్పిన సమాధానం

**మాయాంనసేవే భద్రంతే నవృథా ధర్మమాచరే !**
**శుద్ధభావం గతోభక్త్యా శాస్త్రాద్వేద్మి జనార్దనమ్ !!**

ఓ రాజా! నాకు నీకు గల తేడా వినుము అని ప్రారంభిస్తూ రాజు యొక్క తక్కువదనము తన యొక్క గొప్పతనము చెప్పుటకు ఆరంభించినవాడైనందువల్ల రాజును ముందుగా శాంతపరచుటకై క్షమాప్రార్థనగా "భద్రంతే" నీకు భద్రమగుగాక (అంటే మంగళమగుగాక) అని స్వస్తివాచకం కావిస్తూ, (మాయాం న సేవే) నేను వంచనలు చేయలేదు అలాగే (నవృథా ధర్మమాచరే) లౌకికమైన ప్రయోజనాల కొరకు కానీ ఇహలోక సుఖము కొరకు కానీ ధర్మమును ఆచరించలేదు (ధర్మము: ధరతి లోకాన్ ఇతి ధర్మః అనగా లోకులచే ఆచరింపబడునది), పరిశుద్ధమైన భావనను కలిగి ఉన్నాను. అనగా మనసా, వాచా, కర్మణా ఏకరూపంగా కలిగిన వాడిని (దీనినే త్రికరణశుద్ధి అంటాము).

చివరగా తనదైన ప్రత్యేకతని ఉట్టంకిస్తూ (అనగా పేర్కొంటూ) "భక్త్యా శాస్త్రాద్వేద్మి జనార్దనమ్" కేవలం శాస్త్రం ద్వారా జనించిన జ్ఞానం ద్వారా భగవంతుడిని తెలుసుకోవాలి అని అనుకోలేదు, భక్తితో కూడిన శాస్త్రంతో జనార్దనుని (శ్రీమన్నారాయణుడిని) తెలుసుకున్నాను అంటాడు.

దీన్నిబట్టి, శ్రీకృష్ణ పరమాత్మ యొక్క అత్యంత భక్తుడైన సంజయుడు ధృతరాష్ట్రుడిని ఉద్దేశిస్తూ (లేదా మనల్ని ఉద్దేశిస్తూ అని కూడా భావించవచ్చు) ఏమి చెప్పినట్లయింది అంటే, భక్తిసహకృతశాస్త్రజ్ఞానము అనేది ప్రధానముగా మనం గ్రహించవలసినది. ఈ శాస్త్రములు అన్ని భగవానుడు ప్రవర్తింపచేసాడు అని పైన సంజయుడు పేర్కొన్న లక్షణాలు (వంచన చేయకుండుట, త్రికరణ శుద్ధి కలిగి యుండుట, ధర్మాచరణ విషయములో ఇతర ప్రయోజనములను ఆశింపకుండుట) కలిగి ముఖ్యముగా భక్తితో (ప్రీతి లేదా ప్రేమ) శాస్త్ర అధ్యయనము చేయుటవల్ల మాత్రమే ఆ భగవంతుని కళ్యాణగుణములను మనము తెలుసుకుని అనుభవించే స్థితి కలుగుతుంది. ★

# అక్రూరుల కృష్ణ భక్తి

## తిరుక్కోళూర్ పెన్ పిళ్ళై రహస్యాలు

తిరుక్కోళూరు గొప్ప దివ్య దేశం! ఆ ఊరు వదిలి వెళ్లి పోబోతున్న గొప్ప జ్ఞాన పరిపక్వత కలిగిన ఒక వనిత, ఆ దివ్యదేశంలోకి ప్రవేశిస్తున్న భగవద్రామానుజాచార్యులతో కారణాలను చెబుతుంది. ఆమె మాటలలోని ఆధ్యాత్మిక విశేషములు భక్తి వృత్తాంతములు

భగవత్ సంకల్పం చేత స్వామి రామానుజులు దివ్యదేశయాత్ర చేస్తూ తిరుక్కోళూరికి విచ్చేశారు. ఆ సమయంలో ఒక స్త్రీ తలపై మూట పెట్టుకొని ఒక సంచీ చేతపట్టుకుని ఊరి బయటకు వస్తూ ఉంది. ఆ సమయంలో స్వామి రామానుజులు ఈమెకు ఎదురుగా వచ్చారు. వారిని చూసిన ఆమె ఆచార్యులకు దండం సమర్పించింది. అంత స్వామి ఆమెను చూచి "నీవు ఎవరు? ఎక్కడినుండి వస్తున్నావు? ఎటు వెళ్తున్నావు?" అంటూ ప్రశ్నించారు. ఆమె "తిరుక్కోళూరు నుండి వస్తున్నాను స్వామి!" అంటూ జవాబు చెప్పింది. అది విని స్వామి "తిన్నుమ్ ఎన్నిళమాన్ పురుమూరు" అని నమ్మాళ్వార్లు పాడి ఉన్నారు కదా, అందరూ తిరుక్కోళూరు చేరుతున్నారు కదా! నీవు ఎందుకు వెళ్తున్నావు? అని ప్రశ్నించారు. దానికి ఆమె "స్వామి! నమ్మాళ్వార్లు భగవంతుని యందు ప్రేమ, ప్రీతి, శ్రద్ధ, కర్మ జ్ఞాన భక్తి వైరాగ్యములు, ప్రపత్తి, చరమ పర్వనిష్ఠ, ఆచార్య భక్తి కలవారు చేరవలసిన చోటు మా దివ్యదేశమైన తిరుక్కోళూరు. కానీ నా వంటి అజ్ఞానురాలు అనుష్ఠాన హీనురాలు నివసించుటకు తగదు కదా! అందుకే ఇక్కడి నుండి బయలు దేరాను.అని ఎందుకో వివరిస్తూ 81 వాక్యాలు పలికింది. ఇందులో ఎందరో భక్తుల భాగవతోత్తముల గురించి చెప్పింది. అందులో ఏ ఒక్కరి గుణంగానీ, అనుష్ఠానం గానీ ఈ దాసురాలికి లేవు. అందుకే వెళుతున్నాను అన్నది.



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

ఆమె చెప్పిన విశేషాలలో వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఆళ్వార్ల ఆచార్యుల చరిత్రలు అన్నీ ఉన్నాయి. ఇంకా ముమ్ముందు జరగబోయేవి అన్నీ చెప్పి "జ్ఞాన భక్తి వైరాగ్యములు ఆచార్య నిష్ఠ ఇవన్నీ దాసురాలి వద్ద లేవు కదా స్వామి!" అని పలికింది. ఆమె పలుకుల ద్వారా ఆమె ఎంత అనుష్ఠానపరురాలో నైచ్యానుసంధానం చేస్తూ, అన్నింటిలో ఎంత జ్ఞాన పరాకాష్టను పొందినారో ఆమె వాక్చాతుర్యమే తెలియజేస్తున్నది. ఆ వాక్య రహస్యాలను తెలుసుకుంటే ఎన్నో సాంప్రదాయ విశేషాలు తెలుస్తాయి. ఇక ఆమె పలికిన 81 వాక్యరత్నాల గురించి ప్రస్తావించుకుందాము.

1) "అళైత్తు వరుకితేన్ ఎన్ట్రేనో అక్రూరనైప్పోలే" (నేను చాలా అల్పురాలిని. నేనేమైనా అక్రూరుల వారి అంత యోగ్యత గలదానినా!) అన్నది.

అక్రూరుడు శ్రీకృష్ణ పరమాత్మ యందు అత్యంత భక్తి ప్రావణ్యం కలవాడు, అక్రురుని చూసి కంసుడు "ఓ బావా! నేను ధనుర్యాగం చేయదలచాను. ఆ వేడుకలు చూసేందుకు నా మేనల్లుళ్లు అయిన బలరామకృష్ణులను తీసుకురమ్మని"

# అక్రూరుల కృష్ణ భక్తి



చెప్పాడు. అక్రూరుడు ప్రాతః కాలముననే లేచి నిత్యకర్మాను ష్ఠానములు తీర్చుకొని నందగోకులమునకు వెళ్తూ దారిలో ఇలా అనుకున్నాడు "పరమ యోగులైన వారి యోగ దృష్టికి కూడా గోచరం కాని భగవంతుని నేను చూడబోతున్నాను. పూర్వ జన్మలో ఎలాంటి తపస్సు ఆచరించానో కదా! అని తలుస్తూ ముంగురులతో ప్రకాశిస్తూ, చంద్రుని లాంటి కాంతి తోను, కమల దళాల వంటి కన్నులు గలదైన శ్రీకృష్ణ భగవానుని ముఖాన్ని దర్శించబోతున్నాను. ఇది నిజం! సత్యం! నేను వెళ్లే దారులలో అడవి మృగాలు నాకు ప్రదక్షిణంగా వెళుతూ శుభాన్ని సూచిస్తున్నాయి. రాత్రంతా నేను వెళ్లి మాధవుని చరణాలకు నమస్కరిస్తాను. తన కరకమలాన్ని నా శిరమున ఉంచి అభయ ప్రదానం చేస్తాడు. అని అక్రూరుడు కృష్ణసందర్శనం కోరుకుంటూ రథం ఎక్కి వేగంగా వెళుతున్నాడు. వెళ్ళగా వెళ్ళగా చందనం, మొల్ల, మల్లె, తాడి, మద్ది, గోరింట, మామిడి, మఱ్ఱి,మొదలైన వృక్షాలతో అలరారే, వికసించిన ఎఱ్ఱ తామరల సరోవరం గల, బలరామకృష్ణులకు ఆనందం కలిగించే అందమైన బృందావనం చేరాడు. సంధ్య వేళలో ఆ బృందావనంలో దూడలు కోడెలు తొలిచూలు గేదెలు గుంపులు గుంపులుగా పచ్చని పచ్చికమేస్తూ ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోతే వాటిని వెదుకుతున్న గోపాలురను చూశాడు.

అంబా రావాలతో పాలు కార్చుతున్న గోవులు, అప్పుడే పుట్టిన దూడలను అరచేత ఉంచుకొని బాలింత గోవుల వెంట వెళ్లేవారు. క్రూర జంతువుల బారిన పడకుండా ఈటెలు, విల్లులు ధరించి రెండు వైపులా కాపలాకాస్తూ ఉన్న కాపరులూ... ఇలా బృందావనం అంతా చూస్తూ లోపలికి ప్రవేశించాడు అక్రూరుడు. అంతలో పద్మము, అంకుశం గల పాద చిహ్నాల అడుగుల సవ్వడి విని ఆనందంతో రథం నుండి దూకాడు అక్రూరుడు. శ్రీకృష్ణుని చూడగానే అతనికి ఆనందభాష్పాలతో కన్నులు బరువెక్కాయి. పాదాలకు నమస్కరించాడు. భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు చేయి చాచి అక్రూరుని ఆలింగనం చేసుకున్నాడు. బలరామకృష్ణు లతో కలిసి అతడు నందుని గృహానికి వెళ్ళాడు. నందుడు కుశల ప్రశ్నలు అడిగి భోజన తాంబూల చందనాదులతో సత్కరించి కంసుని గురించి అడిగాడు. శ్రీకృష్ణుడు కూడా తల్లిదండ్రులైన దేవకీ వసుదేవుల కుశలం అడిగి ఇక్కడికి వచ్చిన కారణం తెలుపమంటాడు. ధనుర్యాగమనే మిశతో తనను పంపిన విషయం తెలిపాడు. రేపల్లెలోని పాలు పెరుగు నెయ్యి కట్నాలు కానుకలతో మధురకు బయలుదేరుటకు సిద్ధపడ్డారు. శ్రీకృష్ణుడు వెళ్తున్నవార్త రేపల్లె అంతా తెలిసి గోపికలు అక్రూరుని దూషించి క్రూరుడు అని నిందించి వాపోతున్నారు. ఇక శ్రీకృష్ణుడు బలరామునితో కూడి అక్రూరుడు వెంటరాగా యమునలో నీటిని త్రాగి రథాన్ని అధిరోహించాడు. అక్రూరుడు కూడా యమునలో దిగి స్నానం చేస్తూ చేస్తూ ఆ నదీ జలాలలో బలరామ శ్రీకృష్ణులను దర్శించాడు. ఇందాక మీరు రథంలో కూర్చున్నారు కదా జలం మధ్యలోకి ఎప్పుడు వచ్చారు అనుకుంటూ ఆశ్చర్యంతో మళ్ళీ చూడగా ముందులాగే రథంలోనే ఉన్నారు. నా మనస్సు భ్రమకు లోనైందా! అనుకుంటూ అక్రూరుడు మళ్ళీ నదిలో మునిగాడు. నల్లని వస్త్రం ధరించి సిద్ధులు మొదలగువారిచే కొనియాడబడుచున్న సర్పరాజును చూసి కనురెప్పలు వాల్చలేదు అక్రూరుడు. ఆదిశేషుని పాన్పుగా మధ్యభాగంలో శయనించిన పురుషోత్తముని దర్శించాడు. పసుపు వన్నె పట్టు వస్త్రంతో గల స్వామిని, వక్షస్థలంలో లక్ష్మీ అమ్మను దర్శించాడు. బ్రహ్మ, ఈశ్వరుడు, సనకసనందులు, వేల్పులు అతనిని కీర్తిస్తున్నారు. పాదాది కేశపర్యంతము దర్శిస్తూ ఈ విధంగా వర్ణిస్తున్నాడు అక్రూర మహాశయుడు. శుభలక్షణాలు గల గోళ్ళు పాదములు మడమలు మోకాళ్లు శ్రీవత్సమనే పుట్టుమచ్చ కౌస్తుభమణి ఆకులు పువ్వులు చేర్చిన వనమాలను

# అక్రూరుల కృష్ణ భక్తి

మెడ నుండి కాళ్ళ వరకు వేలాడే తోమాలతో తెల్ల తామరల వంటి అందమైన కళ్ళను శంఖము చక్రము గదా పద్మము ధరించిన హస్తాలను, జందెము మొలనూలు ముత్యాల పేరు బాజు బంధులు అందెలు కంకణాలు మకర కుండలాలు కిరీటము ముఖము చెవులు... నీల మేఘము వంటి శరీరము కలవాడు. శంఖం వంటి మెడ కలిగిన వాడు. లక్ష్మీ తుష్టి పుష్టి కీర్తి కాంతి ఇల ఊర్ధ్వ విద్య అవిద్య శక్తి మాయ మొదలగు తేజోమూర్తులచే వారి శక్తులచే సేవింపబడు స్వామిని దర్శించగానే భక్తి సంభ్రమాలతో చేతులు జోడించి కంఠంతో స్వామిని స్తోత్రం చేశాడు.

అదే అక్రూర దండకం ఇలా తనను స్తోత్రం చేస్తున్న అక్రూరునకు తన పూర్వపు రూపం చూపి అంతర్ధానమై పోయాడు భగవంతుడు. అక్రూరుడు ఆశ్చర్యంతో నీటి నుండి పైకి వచ్చి రథాన్ని అధిరోహించాడు. అంతలో కృష్ణుడు "స్నానానికి వెళ్లి చాలాసేపు అయింది ఆకాశంలో భూమిలో లేని వింతలు ఏమైనా నీటిలో కనిపించాయా?" అని ప్రశ్నించాడు. "నీలో లేని వింతలు ఏ లోకంలోనూ ఉండవు" అని అక్రూరుడు చిరునవ్వుతో నమస్కరించి వారిని మధురాపురికి చేర్చాడు. మధురలో తన గృహాన్ని పావనం చేయమని అక్రూరుడు శ్రీకృష్ణ బలరాములను కోరుతాడు. కంసుని సంహరించాకనే మీ గృహం దర్శిస్తాను అంటాడు కృష్ణుడు. యాదవులలో గొప్పవాడు బంధుప్రీతి కలవాడైన అక్రూరుడు బలరామకృష్ణులను తీసుకురమ్మనగానే దుష్ట కంసుడు వారికి ఏమి కీడు తల పెడతాడో అని జంకి ఒక్కక్షణం ఆలోచించి శ్రీకృష్ణుడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడు, సర్వాంతర్యామి ఐన స్వామికి తెలియని విషయమా! అని ఆలోచించి శ్రీకృష్ణుని సేవించే భాగ్యం తనకు కలుగుతుందని తలచాడు. కంసునితో తాను వెళ్లి బాలరామకృష్ణులను తీసుకొని వస్తాను" అంటాడు. అని తిరుక్కోళూరు పెన్‌పిళ్ళై అక్రూరుని భక్తిని గురించి తెలిపి ఈ విషయం అంతా రామానుజులకు విన్నవించి "అక్రూరుని వలె ఏ విధంగానైనా శ్రియఃపతిని సేవించిన చాలు అని దారిని కూడా వెతుకలేనిదానిని. అని అంటుంది. ఆమె మాటలకు ఆచార్యులు ఆశ్చర్యపోయారట!


★

# పుస్తక పరిచయం

సత్ సంప్రదాయాన్ని ఎవరైనా అర్థం చేసుకొని అనుసరించాలంటే అందుగల నియమములు,ధర్మ విశేషములే కాకుండా అనుసరణ మార్గములు కూడా అవగాహన కావాలి. అందుకు ఆ వేద మార్గస్థాపకులైన ప్రవర్తకులైన మహనీయుల చరిత్రలు అందరికీ తెలియాలి.




అటువంటి పూర్వాచార్యుల కథలను తెలిపే పుస్తకం "ఆచార్య సూక్తి ముక్తావళి– ఆళ్వారాచార్యుల సమగ్ర చరిత్ర" అను పేరు గల ఈ గ్రంథము.దీనికి మూల గ్రంథము ప్రాచీన కవులు రచించినదైన, "ఆచార్య సూక్తి ముక్తావళి".పద్య రూపంలో గ్రాంథిక భాషలో ఉన్న ఆళ్వారాచార్యుల దివ్య కథలను చక్కని సులభగ్రాహ్యమైన వ్యవహారిక శైలిలోకి అనువదించి రచించారు. ప్రముఖ పండితులు పీఠాధిపతుల 'ముందు మాటల'తో కూర్చబడినది. స్పష్టమైన ఆచార్య రత్నమాల ముఖచిత్రంతో, వెనుక పుటపై రచయిత చిత్రము మరియు వివరణలతో ముద్రించ బడింది. మూల గ్రంథంలో వలెనే పూర్వ మధ్యమ ఉత్తర భాగాలుగా విభజించి,ఉల్లాసములు అని ఉపవిభాగములుగా విషసూచికలో




ముద్రించబడింది. కథా కథన విధానము ఆసక్తికరంగా ఉంది. చివరిలో వరవరమునుల చరిత్రను సమగ్రంగా వివరించారు. ఆ క్రమంలో సాంప్రదాయ విషయాలకు మూలం లోని ప్రమాణాలను శ్లోకాలను మరియు తాత్పర్యాలను వివరించడం జరిగింది. సాంప్రదాయ ఆసక్తిపరులకు చక్కని సమాచారాన్ని అందించే గ్రంథంగా ఉపయోగపడుతుంది. గ్రంథ రచయిత కరీంనగర్ వాస్తవ్యులు శ్రీమాన్ సముద్రాల రంగాచార్యులు. 325 పేజీలతో గల ఈ పుస్తకము వెల 250 రూపాయలు.

లభించు ఫోన్ నెంబర్ 957 387 0078.

★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

కపిల మహర్షి తన తల్లికి భక్తియోగం గురించి చెప్పి, తత్త్వలక్షణాలను తెలపటం ప్రారంభించాడు.

"అమ్మా! తత్త్వగుణాలను తెలుసుకొన్న మనుజులు ప్రకృతిబంధాల నుండి విముక్తి పొందుతారు. ఆత్మదర్శనానికి అవసరమైన జ్ఞానం కైవల్యాన్ని కలిగిస్తుంది. ముందు ఆత్మస్వరూప మేమిటో విను. పరమాత్మ అనాది. పురుషుడు అని ఆయననే పేర్కొనాలి. అంటే ఆయనొక్కడే పురుషుడన్నమాట! త్రిగుణాలు సత్త్వం, రజస్సు, తమస్సు లేనివాడు. ప్రకృతిగుణాల కంటె వేరైనవాడు. ఆయన, గుణాలతో కలసి ఉన్నది, అవ్యక్తమూ, భగవత్సంబంధం కల ప్రకృతి లోనికి లీలగా ప్రవేశించాడు. అప్పుడు ప్రకృతి మూడు గుణాలు కలిగిన, సాకారమైన ప్రజలను సృష్టించటం మొదలుపెట్టింది. దానికి పురుషుడు మోహం చెందాడు. తన విజ్ఞానం మరుగున పడిపోయి, ఆ త్రిగుణాత్మక మైన ప్రకృతిని ఆశ్రయించాడు. ఆ గుణాలను తనయందు ఆరోపించుకొని, అన్ని పనులకూ తనదే కర్తృత్వం అనుకొని సంసార బద్ధుడయ్యాడు. తన స్వాతంత్ర్యాన్ని పోగొట్టు కొన్నాడు.

"ఈశ్వరునికి కర్తృత్వంతో సంబంధం ఉండదు. ఆయన కేవలం సాక్షి, అంతే! అందువల్ల ఆత్మకు కార్యకారణ కర్తృత్వాలు లేవని, అవి ప్రకృతి అధీనంలో ఉంటాయని గ్రహించాలి. సుఖదుఃఖాల అనుభవం కూడా ప్రకృతి కన్నా వేరైన పురుషునిదే."

ఇంతవరకూ విన్న దేవహూతి, కపిలమహర్షితో, "ఓ పురుషోత్తమా! ప్రకృతిపురుష లిద్దరూ అస్తిత్వం కలది, లేనిదీ ఐనా ఈ ప్రపంచానికి కారణమైనవారు. కనుక నాకు వారి లక్షణాలను వివరంగా చెప్పు" అని అడిగింది.

"తల్లీ! ఈ ప్రకృతి ఇరవైనాలుగు తత్త్వాలతో కలసి ఉంటుంది. ఎలాగంటే పంచ మహాభూతాలైన నేల, నీరు, నిప్పు, గాలి, నింగి అనే వాటి గుణాలు గంధం, రసం, రూపం, స్పర్శ, శబ్దం అనేవి. వీటినే పంచతన్మాత్రలు అంటారు. చర్మం, నాలుక, ముక్కు, కన్ను, చెవి ఈ ఐదూ పంచ జ్ఞానేంద్రియాలు. నోరు, చేతులు, కాళ్లు, మలావయవం, మూత్రావయవం ఇవి ఐదూ పంచ



శ్రీమతి తిరుమల నీరజ

కర్మేంద్రియాలు. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం ఈ నాలుగూ అంతఃకరణ చతుష్టయం. ఇవన్నీ కలసి ఇరవైనాలుగు తత్త్వాలతో కూడిన "సగుణ బ్రహ్మసంస్థానం" అవుతాయి. "ఆ తర్వాతిది కాలం అనే ఇరవైఐదవ తత్త్వం. పురుషుడు అని మనం ఎవరిని పిలుస్తున్నామో, దాన్నే ఈశ్వరుడనీ, "కాలం" అనీ అంటాము. "నేను" అనే అహంకారంలో పడిపోయి, ప్రకృతితో సంబంధం పెట్టుకొన్న జీవుడు, భయం మొదలైన వాటిని అనుభవిస్తాడు. ఈ ప్రకృతి గుణాలన్నిటిలోనూ ఉన్న భగవంతుని చేష్టావిశేషాలు దేనివల్ల పుడుతాయో అదే కాలం. ఈ కాలం జీవరాశులలో అంతర్గతంగా లోపల ఉంటే పురుషుడు అని, బహిర్గతంగా బయట ఉన్నప్పుడు కాలం అనీ అంటాము. ఆత్మమాయ కారణంగా ప్రకృతితత్త్వాలలో లీనమైన జీవుని వల్ల క్షోభ చెందిన ఈ ప్రపంచానికి కారణమైన ప్రకృతిలో పరమాత్మ తన తేజస్సును ప్రవేశపెడితే, ఆ ప్రకృతి బంగారంతో నిండిన మహత్ అనే తత్త్వాన్ని పుట్టించింది. ఆ పైన మొత్తం ప్రపంచానికీ బీజమైనవాడు, లయమనేదే లేనివాడు ఐన ఈశ్వరుడు, తన సూక్ష్మరూపంలో ఆత్మలో ఉన్న

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

మహదాదిలోకాన్ని ప్రకాశింపజేస్తూ, తన తేజస్సు చేత తనకు నిద్రను కలిగించే తమస్సును చీకటిని లేకుండా చేశాడు.

"ఇక మూడులోకాల లోనూ అందరూ సేవించదగిన దివ్యమైన వాసుదేవం, సంకర్షణం, ప్రద్యుమ్నం, అనిరుద్ధం అనే నాలుగు వ్యూహాలను గురించి చెబుతాను, విను. మొదటి దైన వాసుదేవవ్యూహం ఆకలిదప్పికలు, శోకమోహాలు, జరామరణాలు అనే ఆరు ఊర్ముల శారీరక, మానసిక పీడలు నుండి వేరై, ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలతో పరిపూర్ణమై, సత్త్వప్రధానం, స్వచ్ఛం, శాంతం, నిత్యంగా ఉంటూ భక్తజనులందరూ సేవించే విధంగా అలరారుతూ ఉంటుంది. ఇది వైకారికం, తైజసం, తామసం అని మూడు రకాలుగా ఉంటుంది." వీటిలో వైకారిక అహంకారం మనస్సుకు, ఐదు ఇంద్రియాలకు, పంచభూతాల పుట్టుకకు స్థానమై, దేవతారూపంలో ఉంటుంది. తైజసాహంకారం బుద్ధి రూపంలోను, ప్రాణరూపంలోనూ ఉంటుంది. తామసాహంకారం ఇంద్రియాలతో కలసి ప్రయోజనమాత్రమై పని జరిగేటంతవరకు ఉంటుంది. ఈ వైకారికం సాత్త్వికం. దీన్ని అధిష్ఠించి సంకర్షణ వ్యూహం ఉంటుంది. వేయి పడగలతో వెలిగే అనంతుడైన సంకర్షణ పురుషుడు గొప్పవాడు, మహానుభావుడు. ఆయన పంచభూతాలతో, పంచేంద్రియాలతో, మనస్సుతో నిండి ఉంటాడు. కర్తృత్వ కార్యత్వ కారణత్వాలు అనే రూపభేదాలతో, శాంత, ఘోరత్వ, మూఢత్వాది లక్షణాలతో ఉల్లాసంగా ఉంటాడు. ఈ గొప్ప సంకర్షణవ్యూహం నుండే మనస్తత్త్వం పుట్టింది. 'ఈ మనస్తత్త్వానికి చింతన అనేది చాలా సహజం. ఈ చింతన సామాన్యచింతన, విశేషచింతన అని రెండు రకాలు. వీటినే సంకల్పం, వికల్పం అనీ అంటూ ఉంటారు. ఈ రెండూ కామం అంటే కోరిక నుండి పుట్టినవే. ఇదే ప్రద్యుమ్నవ్యూహం. చివరి దైన అనిరుద్ధవ్యూహం గురించీ చెబుతాను. ఇది ఇంద్రియాలకు అధిపతిగా ఉంటూ, యోగీంద్రులు సేవించే నల్లకలువ వలె మెరుస్తూ ఉంటుంది.

తైజసం అనే అహంకారం నుండి బుద్ధితత్త్వం పుట్టింది. ద్రవ్యానికి వెలుగు కలిగించే జ్ఞానం, ఇంద్రియ అనుగ్రహం,



సంశయం, మిథ్యాజ్ఞానం, ఇంద్రియనిశ్చయం, స్మృతి ఇవి బుద్ధితత్త్వలక్షణాలు. ఈ తైజసాహంకారం వల్లనే ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, క్రియాజ్ఞాన సాధనాలు ఏర్పడ్డాయి. దీని వల్లనే ప్రాణానికి క్రియాశక్తి, బుద్ధికి జ్ఞానశక్తి కలిగి, ఆ రెండూ కర్మ, జ్ఞానేంద్రియాలను పని చేయిస్తాయి.

భగవద్భక్తిని ప్రేరించే తామసాహంకారం నుండి శబ్దతన్మాత్రం పుట్టింది. దీని నుండి ఆకాశం ఏర్పడింది. ఆకాశం వల్ల శ్రోత్రేంద్రియం – వినే అవయవం, కర్ణం, చెవి – పుట్టింది. ఈ శ్రోత్రం లేదా కర్ణం శబ్దాన్ని గ్రహిస్తుంది. అదే శబ్దపు అర్థానికి ఆశ్రయమై, వినేవారికి జ్ఞానం కలగడానికి కారణ మవుతుంది. ఈ శబ్దం వల్ల ఏర్పడిన ఆకాశం, జీవులందరికీ లోపల, వెలుపల అవకాశం ఆవ్వడమే కాక, ఈ ఆత్మప్రాణానికి, ఇంద్రియాలకు ఆశ్రయంగా ఉంటుంది. కాలగతి చేత వికారం పొందే ఈ శబ్దతన్మాత్ర లక్షణాలున్న ఆకాశం వల్ల స్పర్శ, స్పర్శ వల్ల వాయువు పుట్టాయి. ఆ వాయువు వల్ల స్పర్శను గ్రహించగలిగే చర్మం పుట్టి స్పర్శజ్ఞానం కలిగించింది. ★

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

వాస్తు శాస్త్రంలో ప్రాధాన్యమైన స్థానం ద్వార వాస్తుకు వుంది. ద్వార వాస్తు గురించి కొంత కొంత తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. గృహంలో ప్రవేశించాలన్న, గృహంలో నుండి బయటకు రావాలన్న ప్రధానమైన వ్యవస్థ ద్వారం. ఆ ద్వార సంఖ్య ఎలా ఉండాలి? ద్వార ప్రమాణం ఎలా ఉండాలి? ద్వారాన్ని ఉంచే స్థానం ఎలా ఉండాలి? ఏ స్థానంలో ద్వారాన్ని ఏర్పాటు చేయాలి? అని మనకు వాస్తు శాస్త్రములో చెప్తూ ఉంటారు. ప్రధానంగా సరి సంఖ్యలలో ద్వారాలు ఉండాలి అని, అలాగే కిటికీలు గాని, వెంటిలేటర్లు గానీ, కబోర్డ్స్ (సామాగ్రి ఉంచే స్థానాలు) గాని అన్ని సరి సంఖ్యలోనే ఉండాలని చెబుతుంటాయి.

విశేషంచి ద్వారాలు సరిసంఖ్యలో ఉండాలి, కిటికీలు సరి సంఖ్యలో ఉండాలి, వెంటిలేటర్లు సరి సంఖ్యలో ఉండాలి, కబోర్డ్స్ సరిసంఖ్యలో ఉండాలి. ఇవి అన్ని కూడితే కూడా సరి సంఖ్య రావాలి. సరి సంఖ్య అంటే 2 4 6 8 12 14 16 18 ఇలాగ. మరి పది కూడా సరి సంఖ్యనే కదా అని మనం ప్రశ్నించుకోవాలి కానీ సున్నాతో కూడిన సంఖ్య సరి సంఖ్య అయినప్పటికీ కూడా దాన్ని గ్రహించ కూడదు అని చెప్పబడివుంది. అన్ని కూడా సరి సంఖ్యలోనే ఉండాలి ఉదాహరణ మూడంతస్తుల భవనం నిర్మాణం చేసుకున్నప్పుడు ద్వారాలు కిటికీలు వెంటిలేటర్లు కబోర్డ్స్ ఒక్కొక్క అంతస్తులలో ఉండేటువంటి ద్వారాలు కిటికీలు గాని కబోర్డ్స్ వెంటిలేటర్లు సరిసంఖ్యలో ఉండాలి వాటిని కూడినా కూడా సరిసంఖ్యలో ఉండాలి. దానిలో సున్నా ఉండకూడదు అనే అభిప్రాయాన్ని మనకు శాస్త్రం ప్రస్ఫుటంగా చెప్పబడి ఉంది.

అందుకు ద్వారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆ ద్వారం పెట్టే స్థానం ఏ స్థానమో, శాస్త్రం నిర్ణయించిన స్థానంలో పెట్టడం జరిగితే శుభాలు కలుగుతాయి. ఉదాహరణ ద్వారం నుంచి హితులు వస్తారు. ద్వారం నుంచే స్నేహితులు వస్తారు. ద్వారం నుంచే ఆచార్య పురుషులు, బంధువులు వస్తారు. శత్రువులు కూడా ఆ ద్వారం నుంచే రావాలి. మంచి స్థానంలో ఒక ద్వారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా శాస్త్రం చెప్పిన స్థానంలో వచ్చే ఇటువంటి ఒక వ్యక్తికి శత్రు బుద్ధి వున్నా ఆ ద్వారం నుంచి లోపలికి వచ్చి నప్పుడు ఆ స్థానం యొక్క గొప్పతనం చేత అతడు తన శత్రువు బుద్ధిని లేదా ఏదో అశుభం కలిగించాలన్న ఉద్దేశాన్ని మరిచిపోతాడు అదే ద్వారాన్ని పెట్టకూడని స్థానంలో శాస్త్రంలో చెప్పని స్థానంలో పెట్టడం ద్వారా మంచి వాడు వచ్చినప్పటికీ కూడా దానిలో నుండి ప్రవేశం కాగానే ఆయన మనస్సు వికారభూతమైన ఆలోచనలకు దారి తీస్తాయి. అందుకే ద్వారాలకు ఒక గృహాన్ని పొడవు వెడల్పు కొలిచి ఆ పొడవును ఎన్ని భాగాలు ఏ ద్వారాన్ని పెట్టుకోవచ్చు సింహద్వారం ఎలా పెట్టుకోవచ్చు. దాని తర్వాత ఉప ద్వారం లోపలికి గదులలోకి వెళ్ళే ద్వారాలు ఏ స్థానంలో పెట్టుకోవచ్చు. దాని తర్వాత ఉపోప ద్వారములు అంటే అవతల పూర్తిగా వాడుకునేవి కానీ స్నానశాలలు గాని, సామానుల గదులలో గాని వెళ్ళేటువంటి ద్వారాలు ఎలా పెట్టుకోవచ్చు అని మనకు శాస్త్రం నిక్కచ్చితంగా చెప్పింది. గృహ వాస్తు శిరోమణి అనే గ్రంథలో ఓ శ్లోకంలో చెప్తారు. సరి సంఖ్యలో ఎందుకు ఉండాలి. బేసి సంఖ్య ఉంటే కలిగే ఫలం ఏమిటి?

"గృహాది ద్వార మారభ్య ద్వయాన్తం గృహముత్తమం" ఒక గృహానికి ఒక ద్వారం ఉండటం ద్వారా స్థిరమైన ఆలోచన లేనివాళ్ళు అవుతారని, రెండు ద్వారములు ఉంటే ఉత్తమ గృహంగా కీర్తించబడుతున్నది. మూడు ద్వారాలు ఉంటే ఆ గృహము శత్రువులకు నిలయమవుతుంది.

★

# భరన్యాసము భగవంతుని పైనే భారము

**అహం మద్రక్షణభరో మద్రక్షణ ఫలం తథా।**
**నమమ శ్రీపతే రేవేత్యాత్మానం నిక్షిపేత్ బుధః॥**

ఈ శ్లోకంలో అపృథక్ దంపతులైన లక్ష్మీ నారాయణులను శ్రీపతి యని ఎంత చక్కగా సంబోధించారు! సామాన్యులకు కూడా, శ్రీపతి అనటం వల్ల ద్వయ మహామంత్రములోని శ్రీమన్నారాయణ తత్వము బోధపడుతుంది. ఓం కారములో వుండే పిరాట్టి రెండు విధాలుగా చెప్పబడినా, అక్కడ పిరాట్టి అవ రక్షణే ధాతువులో దాగుండి పోయింది!

ఉ కారములో పురుషకార రూపిణిగానే దర్శన మిస్తోంది! మరి రక్షణలో పిరాట్టిదే కదా ప్రథమ పాత్ర! పిరాట్టితో కూడిన నారాయణుడు సౌమ్యుడు, సులభుడు. మన దోషాలను మన్నించేసే స్వామి! అందుకే దేశికులవారు స్పష్టంగా పిరాట్టిని దర్శింపజేస్తూ మనకు అభయమిస్తూ "శ్రియః పతి" అనియే పరమాత్మను పేర్కొన్నారు. ఇలా మొదటి శ్లోకములో ఆత్మ సమర్పణానికి 'అంగి' అనగా "శరణాగతికి అంగిని" (స్వరూపాన్ని) ప్రస్తావించారు! రెండవశ్లోకములో

**న్యస్యామ్య కిన్చః శ్రీమన్ అనుకూలోన్య వర్జితః।**
**విశ్వాస ప్రార్థనా పూర్వం, ఆత్మరక్షా పరం త్వయి॥** అంటూ ఆత్మ సమర్పణానికి కావలిసిన "అంగములను" చెప్తున్నారు!

శ్రీమాన్! అని పరమాత్మను సంబోధిస్తున్నారు! పరమాత్మ శ్రియః పతి. "హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్నౌ" శ్రీత్వాన్ని కలిగించే లక్ష్మీ పిరాట్టిని పత్నిగా గలవాడు అని అర్థం. పరమాత్మ గుణాలన్నీ పిరాట్టిలో ప్రతిఫలిస్తుంటాయి. కానీ పరమాత్మ నిరంకుశాధికారం పిరాట్టిలో కనబడదు. పిరాట్టిలోని ఆశ్రయణ తత్వం పెరుమాళ్ళలో లేదు. మనకు విష్ణుసహస్ర నామములో 4 చోట్ల పరమాత్మకు "శ్రీమాన్" నామమును భీష్మాచార్యులు ఉటంకిస్తారు.

1) నారసింహ వపుః శ్రీమాన్! (సదా లక్ష్మీ పిరాట్టితో కూడి వుండేవాడు).

2) అనిర్దేశ్య వపుః శ్రీమాన్! (శుభ ప్రదుడైన స్వామి)

3) అగ్రణీ గ్రామణీ శ్రీమాన్! (ఉత్కృష్టమైన దేదీప్యమాన కాంతిని గల వాడు)

4) శ్రీమాన్ లోకత్రయాశ్రయః! (సర్వ విధముల ఐశ్వర్యములు గలవాడు) ఇదంతా " పిరాట్టి యొక్క కరుణతో



శ్రీమతి వంగల రాధిక

దక్కేఫలం, అంతేకాదు "విముక్తి ఫలదాయినీ" సకల కర్మ ఫలముల నుండి విముక్తి కలిగించి సత్ఫలముల నొసగే తల్లి ఆమె.

**పూమేల్ ఇరుప్పాళ్ నమ్ వినై తీర్కుమే** ఇలా పిరాట్టితో కలిసి, అపృథక్ దంపతులైన లక్ష్మీనారాయణులే ఆశ్రయణీయులు! అలాంటి శ్రీమన్నారాయణుని "శ్రీమాన్" అని సంబోధిస్తూ దేశికుల వారు, న్యాసదశకంలో శరణాగతికి అంగములను వివరిస్తున్నారు. అవి అహిర్బుధ్న్య సంహితలో చెప్పబడ్డాయి. ఆ శ్లోకం చూద్దాము.

**ఆనుకూలస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం।**
**రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వ వరణం తథా।**
**ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్ విధా శరణాగతిః॥** ఈ 2 వ శ్లోకం పదవిభాగం చేసుకొంటే మనకు ఆహిర్బుధ్న్య సంహిత ప్రత్యక్ష మవుతుంది! ఎలాగో చూద్దాము!

శ్రీమాన్! (ఇది పరమాత్మను సంబోధించడము)

న్యస్యామి (వదిలేస్తున్నాను) అకిన్చః (అన్నీ వదిలేసాను, ఏమీ చేయలేని స్థితిలో నిన్నే నమ్ముకొని వున్నాను.) అనుకూలః (పరమాత్మ రక్షించడానికి వచ్చినప్పుడు, అడ్డు చెప్పే వాడిని కాను), అన్యవర్జితః–

# భరన్యాసము భగవంతుని పైనే భారము

పరమాత్మ తప్ప మరెవ్వరూ లేరు, అనే ధృఢవిశ్వాసము కలిగి, సాధనాంతరా లను విసర్జించాను) విశ్వాస (ఈసంకల్పమును తీసుకొని పరమాత్మపై ధృఢ అధ్యవసాయము, విశ్వాసంతో వున్నాను) ప్రార్థనాపూర్వము (ఆయనే నాకు సత్గతి కలిగించాలని అంజలిఘటించి ప్రార్థిస్తున్నాను) ఆయనను పొందడానికి ఆయనే ఉపాయము! ఆత్మ రక్షా పరం త్వయి ( ఈ ఆత్మ నాది కాదు. నీ సొత్తు. త్వయి నీదైన దానిని నీవే రక్షించుకో! చక్కగా చిన్న పదాలతో ఎంతో అందంగా ఆ సంహితలోని అర్థంగా చెప్పబడింది.

శరణాగతికి ఏది అవసరమో దానిని పరిపూర్ణముగా తెలుసుకొని, శరణాగతికి ప్రబంధకమైనవన్నీ పూర్తిగా వదిలేసి! పరమాత్మే మనకు అసలు బంధువు సుహృత్, అన్ని విధముల బాంధవ్యాలు ఆయనతోనే, అని తెలుసుకోవడము సామాన్య విషయము కాదు! ప్రపంచంలో మనము తల్లి తండ్రి భార్య పిల్లలు స్నేహితులు అంటూ వీరందరే మనవారమనుకొంటూ, వీరందరూ మనలను అమితంగా ప్రేమిస్తున్నారనుకొంటూ, భ్రమలో బతికేస్తున్నాము. ఈ జన్మకు కూడా ఈ బాంధవ్యాలు మనకు వుపయోగపడేవి కాదు.



తండ్రి దశరథుడు తానిచ్చిన మాటకై, తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన రాముని అడవికి పంపాడు! తల్లి కైకేయి, తన కుమారుని ఉన్నతి అనుకొని, భరతుడు దేశ ప్రజలచేత దూషించబడేట్లుగా, ఆఖరికి భరతుని హృదయం మిక్కిలి క్షోభిల్లేటట్లుగా ప్రవర్తించింది. వాల్మీకి బోయవాడుగా నున్నప్పుడు అతని పాపములో తనకు వంతు లేదన్నారు భార్య, పిల్లలు కూడా! గజేంద్రుడు మొసలి చేత పట్టుబడినప్పుడు, భార్య పిల్లలు, బంధువులు, స్నేహితులు, అందరూ అతనిని పోరాడమని ప్రోత్సహించారే తప్ప, ఓడిపోయి, మొసలికి ఎరగా మారిపోబోతున్నప్పుడు, ఎవ్వరూ రక్షించలేక పోయారు! ఈ ప్రపంచములోని సంబంధాలన్నీ ఇంతే! పరమాత్మయే అసలైన రక్షకుడు. ఆపద వచ్చినప్పుడు అది తెలుసుకోవడము కాదు. విభీషణుడిలా, బుద్ధి చెప్పి అన్నను మార్చవచ్చున్న ఆశ వున్నంతవరకు అన్నను అంటిపెట్టుకొని వున్నాడు. ఎప్పుడు తన అన్న తననే దూషించి తరిమాడో తత్ క్షణమే, తన భార్య పిల్లలు, బంధువులు, రాజ్యము అన్నింటినీ వదిలేసి, పరమాత్మ ఐన రాముడే రక్షకుడని శరణాగతి కోరాడు. **"ఊరిలే కాణి ఇల్లే ఉరవు మట్రారుమిల్లై"** అని సకలమును తానుగా త్యజించడానికి మామూలు ధైర్యము చాలదు. చాలా ధృఢమైన మనస్సు వుండాలి. అలా అన్నింటినీ వదిలి తనకు పరమాత్మ తప్పవేరే ఎవరూ లేరనే ధృఢ అధ్యవసాయము విశ్వాసము పొందాలి. ఈ జగములో ఆయనే మనకు గతి, ఆయన తప్ప మనకు రక్షకుడెవ్వడూ లేడనే, ఆయననే శరణు వేడాలి. మనస్సులో స్థిరముగా కాంచీపుర వరదుడినే నమ్మి, ఆయనకే శరణాగతి చేయడానికి పూనుకొన్నారు!

**"నల్లడైక్కలమాయ్ అడైన్దేనే"** అంటారు దేశికుల వారు! అదే! పరిపూర్ణ శరణాగతి! అంటే ధృఢముగా పరమాత్మ తిరుకమల పాదములను గట్టిగా పట్టుకోవడము. అదే "నల్లడైక్కలమ్" శరణాగతి చేయనంతవరకు! నేను, అహం శరణాగతి చేసిన తరువాత నేను కరిగి పోతుంది! పరమాత్మ సొత్తుగా మారిపోతాము. శరణాగతి చేసే ముందుకూడా ఆత్మజ్ఞానము ఏర్పడలేదు! ఎప్పుడు ఆత్మ స్వరూప జ్ఞానము ఏర్పడిందో, అప్పుడు, ఇంక పరమాత్మ తిరుచరణాలలో పడిపోతాము! ఈ ఆత్మ స్వరూపజ్ఞానము ఏర్పడడమే నల్ల అడైక్కలము! అనగా ఎవరో ప్రబోధించి శరణాగతి చేయడము కాదు! ఎవరి ప్రేరణమీదో కాదు! తమంతట తాముగా జ్ఞానము తెలుసుకొని ఆచరించడము. ఈ విషయాలే న్యాసదశకము లోనూ చెప్పారు దేశికుల వారు!

## శ్రీరామాయణంలో ఉపకథలు

# సీత చెప్పిన కాకాసుర వృత్తాంతము



యత్ర యత్ర రఘునాథ కీర్తనం,
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
భాష్పవారి పరిపూర్ణ లోచనం,
మారుతిం నమత రాక్షసాంతకమ్'

శ్రీ రామాయణం సుందరకాండ 38వ సర్గలో సీతాదేవి హనుమకు కాకాసుర వృత్తాంతాన్ని చెప్పింది. ఈ కథ అతి అంతరంగమైనది. సీతారాముల మధ్య జరిగిన వృత్తాంతం, సీతారాములకు మాత్రమే తెలిసిన వృత్తాంతం. ఇలాంటి కథను సీతమ్మ హనుమంతుడికి ఎందుకు చెప్పిందో చూద్దాం. ' అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయద్రాఘవో హి యత్' అని రాముడికి అభిజ్ఞానంగా గుర్తుగా ఏదైనా ఒక ఆనవాలును ఇవ్వమని సీతను అడిగాడు హనుమ. అప్పుడు ఆమె 'ఇదం శ్రేష్టమభిజ్ఞానం బ్రూయాః త్వం తు మమ ప్రియమ్' అని ఈ కాకాసుర వృత్తాంతాన్ని చెప్పింది. చిత్రకూట పర్వతానికి ఈశాన్య భాగంలో ఒక ఉప పర్వతం ఉంది. అక్కడ కందమూలాలు పుష్కలంగా దొరుకుతాయి. అక్కడే ఒక సిద్ధాశ్రమం ఉంది. ఆ సిద్ధాశ్రమం లో సీతారాములు ఉండగా జరిగిన కథ ఈ కాకాసుర వృత్తాంతం. ఆ సిద్ధాశ్రమం దగ్గర అనేక ఉప వనాలు ఉన్నాయి. అలసి స్వేదజలంతో తడిసి రాముడు, సీత ఒక చోట కూర్చున్నారు. అప్పుడు అలసిపోయిన సీత, రాముడి ఒడిలో కూర్చుంది. ఇంతలో ఒక కాకి వచ్చి మాంసం కోసం ఆశపడి సీతమ్మ స్థనాలను తన ముక్కుతో పొడిచింది. సీతమ్మ ఆ కాకిని తోలడం కోసం మట్టి పెడ్డలు తీసుకొని దాని మీదికి విసిరి దూరంగా కొట్టాలని ప్రయత్నం చేసింది. అయినా అది అక్కడక్కడ తిరుగుతూ పదేపదే బాధిస్తూనే ఉంది. కోపంతో సీత ఆ కాకిని అదలించి సడలిపోయిన తన వడ్డాణాన్ని సరిచేసుకుంది. జారిపోతున్న వస్త్రాన్ని సర్దుకుంది. అప్పుడు రాముడు ఆ కాకి మీద కోపంతో ఉన్న సీతను చూసి పరిహాసంగా నవ్వాడు. అలసిపోయిన సీత రాముని దగ్గరికి వెళ్ళింది రాముడి ఒళ్ళో చేరింది. కోపంతో ఉన్న సీతను రాముడు నవ్వుతూ ఓదార్చాడు. గాయం కారణంగా ఆమె



శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం

కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అలాగే ఆయన ఒళ్ళో పడుకుని నిద్ర పోయింది. కొంత సేపటికి సీత నిద్ర లేచింది. రాముడు సీత ఒళ్ళో తల పెట్టి పడుకున్నాడు. మళ్ళీ ఆ కాకి వచ్చి సీతమ్మ స్థనాలను పొడవడం మొదలు పెట్టింది. ఎంత కొట్టినా పోలేదు. అప్పుడు సీత రాముడిని నిద్ర లేపింది. లేవగానే రాముడు సీత బాధను చూసి కోపంతో నిన్ను గాయపరిచే వాడెవడు? విస్తృతమైన పడగలు గల భయంకరమైన మహా సర్పంతో ఆడుకున్నది ఎవరు? అని అడిగాడు. అంతలో రక్తసిక్తమైన గోళ్ళతో ఉన్న కాకి రాముడి కంట పడింది. దానిని చూసి ఆ కాకే ఈ పని చేసింది అని గ్రహించాడు. వెంటనే అక్కడ ఉన్న ఒక దర్భను తీసుకొని బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి ఆ కాకి మీదకు వదిలాడు. ఆ మండుతున్న బ్రహ్మాస్త్రం కాకి వెంట పడింది. దాని నుంచి తప్పించుకోవడం కోసం ఎన్నో చోట్ల తిరిగింది. మూడు లోకాలు తిరిగింది. తండ్రి అయిన దేవేంద్రుడి దగ్గరికి వెళ్ళింది, ఋషుల దగ్గరకు వెళ్ళింది. కానీ ఎవ్వరూ దాన్ని రక్షించలేదు. రక్షించే శక్తి ఎవరికీ లేదు. అంతా తిరిగి తిరిగి ఆఖరికి ⇨

# సీత చెప్పిన కాకాసుర వృత్తాంతము

'త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః' సర్వలోక శరణ్యుడైన ఆ రాముడి దగ్గరకు వచ్చి ఆయన కాళ్ళ దగ్గరే నేలమీద సాగిలపడింది.

తనను శరణు వేడిన ఆ కాకిని రాముడు రక్షించాడు. ఆ కాకితో నేను ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వృధా కాదు కాబట్టి ఏం చేయాలో నువ్వే చెప్పు అన్నాడు. ఆ కాకి నీ బ్రహ్మాస్త్రం నా కుడి కంటిని రూపుమాపు గాక అని అడిగింది. 'దత్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః' అని కుడి కంటిని ఇచ్చి ప్రాణాన్ని రక్షించుకున్నది. రాముడు ఆ కాకి కుడి కన్ను తీసేశాడు. అప్పటి నుంచి కాకికి ఒకటే కన్ను ఉండటం మొదలైంది. అందుకే కాకిని ఏకాక్షి అని అంటారు. మహావీరుడైన రాముని దగ్గర సెలవు తీసుకొని తన ఇంటికి వెళ్ళిపోయింది. నా కోసం ఒక కాకి మీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన రాముడు వచ్చి రావణుడిని హతమార్చి నన్ను తీసుకు వెళతాడు అని సీతమ్మ హనుమతో చెప్పింది.

ఇంత అంతరంగమైన కథను, సీతారాములకు మాత్రమే తెలిసిన కథను హనుమకు ఎందుకు చెప్పింది? హనుమ అడిగింది అభిజ్ఞానం. దానికి తన వివాహసమయంలో మామగారు ఇచ్చిన చూడామణిని ఇస్తే సరిపోతుంది. అయినా ఈ కథను ఎందుకు చెప్పింది?

1. సీత అంతఃపుర వనిత, ఆమె దగ్గరికి ఒక దూతను పంపాలంటే ఎంతో నమ్మకం విశ్వాసం ఉన్నవారికి తప్ప అన్యులను రాముడు పంపలేడు. రాముడు ఆ వానర సైన్యంలో హనుమను దానికి సమర్థుడుగా ఎంచుకొని సీత దగ్గరికి పంపాడు. సీత రాముడి మనసు గ్రహించి ఆయన హనుమను ఎలా గౌరవించాడో, విశ్వసించాడో, సన్మానించాడో అలాగే తను కూడా హనుమను విశ్వసిస్తున్నాను సన్మానిస్తున్నాను గౌరవిస్తున్నాను అని తెలియజేయడం కోసం అతి అంతరంగమైన తమ అనుభవాన్ని, తనకు రాముడికి మాత్రమే తెలిసిన ఈ వృత్తాంతాన్ని హనుమకు చెప్పింది.

2. సీత రాములు అన్యోన్య దంపతులు. అన్యోన్య దంపతులు మాట్లాడు కోనవసరం లేదు. మాట్లాడకుండానే తమభావాలను పరస్పరం తెలియజేసుకుంటారు. అందుకే తగిన దూతను పంపిన రాముడి నిర్ణయానికి తన అంగీకారాన్ని, మెచ్చుకోలును తెలియజేయడానికి ఈ కథను



హనుమకు చెప్పడం ద్వారా తెలిపింది.

3. రాముడి నమ్మకాన్ని హనుమంతుడు నిలుపుకున్నాడని, హనుమంతుడి రాక వలన రామలక్ష్మణుల క్షేమసమాచారం తెలిసి తనకు ఊరట కలిగిందని తెలియజేయడం కూడా ఇందులో ఇమిడి ఉంది.

4. హనుమంతుడు నవ వ్యాకరణ పండితుడని రాముడే మెచ్చుకున్నాడు. ఎవరి దగ్గర ఎంత మాట్లాడాలో అంతే మాట్లాడతాడు. ఒక్క అక్షరం కానీ పదం కానీ ఎక్కువ చెప్పడు, తక్కువ చెప్పడు. ఎదుటి వారి మనసు తెలిసి మాట్లాడుతాడు, ఎవరిని నొప్పించడు. అలా మాట్లాడగల సమర్థత ఉండటం వలననే రాముడి మనసును సీత దగ్గర ఆవిష్కరించాడు. అదేవిధంగా సీత మనసును కూడా రాముని దగ్గర ఆవిష్కరించగలడని ఈ కథను చెప్పింది.

5. తాను ఈ అశోక వనంలో ఒంటరిగా ఉన్నా ఇంకా ప్రాణం ధరించి ఉంది అంటే రాముడికి తనకు మధ్య జరిగిన సంభాషణలను ధారక, పోషక, భోగ్యతలుగా స్మరించుకోవడమే కారణం అని రాముడికి తెలియజేసింది.

కిష్కింధలో పడ్డ సీతమ్మ నగలు హనుమకు దొరకడం వలన పరోక్షంగా ఆమె పురుషకారం దొరికి రాముని దర్శన భాగ్యం, రామునితో మైత్రిని పొందే భాగ్యం కలిగింది. రామునితో స్నేహం చేయడం వల్ల హనుమకు, సీతమ్మను దర్శించుకునే భాగ్యం దొరికింది. సీతను దర్శించుకోవడం వలన ఆమె పురుషకారంతో రామ దూతగా వచ్చిన హనుమ రామదాసుగా మారి రాముని దగ్గరికి తిరిగి వెళ్ళాడు. అన్నింటినీ మించి అతి దుర్లభమైన రాముని పరిష్వంగ భాగ్యం అబ్బింది. ఇంత కంటే ఇంకేం కావాలి? సీతమ్మ కృప, పురుషకారం ఉంటే ఏదీ దుర్లభం కాదు. అన్నీ సులభమే అవుతాయి. ★

# ప్రమాతృకైంకర్యం అవయవ విభూతి

అధోముఖముగా వృద్ధి చెందుతూ కాంతితో ప్రకాశించే ప్రవాహములు కల రామానుజుల వారి ఆసనము యొక్క అభిఘాతములచే అడ్డగింపబడి సుడిగా మారినట్టు రెండు వైపులా చేర్చబడి నిబిడమై మడిచి ఉన్నాయట ఆ మోకాళ్లు! "లోకం శ్రీపాద పంకజం" వడక్కుతిరు వీధి పిళ్ళై వారి తిరుక్కుమారులు అయిన శ్రీ పిళ్ళైలోకాచార్య స్వామి వారు వేంచేసి ఉంటారుట భగవద్రామానుజుల వారి శ్రీపాదము లలో. శ్రీ వైష్ణవ ఆలయాల మీద, పెరుమాళ్ళ మీద ఆనాటి కాలంలో జరిగిన తురుష్కుల రాజుల పాలనలో కలిగిన దాడులకు ఉపద్రవాలకు దీటుగా నిలచి భగవంతుడైన నంబెరుమాళ్లను పెరియపిరాట్టిని రక్షించిన త్యాగమూర్తి వీరు. కేవలము కొద్ది కాలమే ఈ భూమండలం మీద వేంచేసి ఉన్నను 18 రహస్య గ్రంథాలను రచించిన మహానుభావులు వరదరాజుల అపరావతారం. ఆచార్య శిష్య సంబంధాన్ని తెలిపిన గొప్ప గ్రంథం శ్రీవచన భూషణాన్ని లోకానికి అందించిన మహోపకారకులు. ఇందాక మనం అనుకున్నాం కదా! ప్రమాణ ప్రమేయ, ప్రమాతృ, కైంకర్యాలు. అందులో ప్రమాతృ కైంకర్యం చేసిన వారు అంటే సాక్షాత్తు భగవంతుడినే రక్షించిన వారు వీరు. అందువలన రామానుజుల వారి శ్రీపాదాలను సేవిస్తే మనకు ఈ ప్రమాతృ కైంకర్యం లభిస్తుందన్నమాట!

రామానుజుల వారి శ్రీపాదాలను ఏమని వర్ణించగలం సాధ్యమా? "ఉన్‌తేనే.... అరుళాయ్" అన్న పాశురంలో తేనె వంటి మధురమైన పాదాలను ఆశ్రయిస్తున్నాను అన్నారు నమ్మాళ్వార్లు. అలాగే "పాదారున్తుదమేవ పఙ్కజరజ శ్చేటిభృశాలోకితైః అఙ్గమ్లాని రథామ్బ! సాహసవిధౌ లీలారవిన్దగ్రహః। డోలా తే వనమాలయా హరిభుజే హా కష్ట శబ్దాస్పదం కేన శ్రీ రతికోమలా" అన్నారు భట్టర్ వారు. "పుప్పొడి లక్ష్మీదేవి శ్రీపాదాలను బాధిస్తుందట. చెలికత్తెల చూపులకు ఆవిడ శరీరం వాడి పోతుందట! అంతటి కోమల




శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.

అయిన లక్ష్మీదేవి శ్రీమన్నారాయణుడి శ్రీపాద సేవనం చేస్తున్నప్పుడు భయపడుతూ భయపడుతూ సంవాహనం చేస్తుందట! ఎక్కడ తామర పుష్పపు శ్రీపాదాలు కంది పోతాయేమోనని. అసలే తామర పుష్ప వర్ణము కలిగిన ఎర్రటి శ్రీపాదాలు అవి. అంతటి సుకుమారుడైన స్వామిని మోస్తున్న వారు ఆదిశేషులు. మరి వారే కదా రామానుజులుగా అవతరించారు. మరి వారి శ్రీపాదాల సౌకుమార్యం ఏమని వర్ణించగలం కనుక. అలా దివ్యమైన ఆసనంలో వేంచేసియున్న రెండు మోకాళ్ళను మడిచి ఉన్న ఆ శ్రీపాదాలకు అతిపెద్ద దాసోహం సమర్పించడం తప్ప. అదే కదా మణవాళ మామునులు ఆర్తి ప్రబంధంలో "ఎంబెరుమానార్ తిరువడిగళే శరణం" అని అనుగ్రహించారు. "శీరారు మెతిరాశర్ తిరువడి గళే వాళి"

# ప్రమాత్మ కైంకర్యం - అవయవ విభూతి

కళ్యాణ గుణాలతో పరిపూర్ణులైన శ్రీ రామానుజులవారి శ్రీచరణాలు నిత్య మంగళంగా వేంచేసి ఉండాలి. అంటున్నారు మణవాళమామునులు ."రేఖాం శ్రీశైల నాథాఖ్యం పాదుకాం వరయోగినం

పుంద్రం సేనామునిం ప్రోక్తం సూత్రం కూరపతిం తథా" సకల సంపదలను సకల శుభాలను అనుగ్రహించే శ్రీరామానుజుల అవయవ విభూతి అనే స్తోత్రమందు ఆచార్య పదవికే వన్నెతెచ్చిన భగవద్రామానుజుల వారి తిరుమేని యందు ఒక్కొక్క అవయవములో ఒక్కొక్క ఆచార్యులు వేంచేసి ఉంటారని, ఆ ఫలానా స్థానాన్ని సేవిస్తే తత్ సంబంధిత ఫలం లభిస్తుందని తెలుసుకోవడం జరిగింది.



ఇది అందరికి ఫలములనిచ్చు కల్పలత యొక్క ప్రసవమా? లేక జగన్మోహన మంత్ర ప్రభావమా? లేక సకల రసగులికా విశేషమా? అన్నట్టు ఉండే భగవత్ రామానుజుల వారి శ్రీపాదములయందు పిళ్ళైలోకాచార్య స్వామి వారు వేంచేసి ఉంటారని చదువుకున్నాం కదా! ఆ శ్రీపాదాలే కదా మన అందరికీ ఉజ్జీవనం ఇక ఈ శ్లోకంలో భగవద్రామానుజుల వారి పాదరేఖలను వర్ణిస్తున్నారు.

రేఖాం శ్రీశైల నాథాఖ్యం దేశములన్నింటిలో ప్రకాశించే వైభవాన్ని కలిగినవారైన తిరువాయుమొళిప్పిళ్ళై గారు అనబడే తిరుమలై ఆళ్వాన్ అనబడే శ్రీశైల నాథులు వేంచేసి ఉంటారు భగవత్ రామానుజుల వారి శ్రీపాద రేఖలలో. తిరుమాలవన్ కవి అయిన వీరికి నమ్మాళ్వార్ల తిరువాయి మొళి యొక్క అర్థగాంభీర్యాన్ని భావ సౌందర్యాన్ని ఎల్లప్పుడూ అనుసంధానం చేసుకోవడం వలన తిరువాయిముడి పెళ్ళై అన్న తిరునామం ఏర్పడింది. కుంతీ నగర జన్మని అన్నట్టుగా ఆళ్వార్ తిరునగరిలో అవతరించారు వైగాశి విశాఖంలో. "ప్రసాదలబ్ధ పరమ ప్రాప్య కైంకర్య శాలినే" ఆనాటి కాలంలో భగవంతునికి భాగవతోత్తములకు సాంప్రదాయ గ్రంథాలకు ఏర్పడిన ఉపద్రవాలను ఎదుర్కొని ధీటుగా నిలిచి పరమప్రాప్యమైన కైంకర్యాన్ని ప్రసాదంగా లభింప చేశారు ఎటువంటి దోషం లేని ఆత్మజ్ఞాన గుణాలను కలవారు అందువలన భగవద్రామానుజుల వారి శ్రీపాద రేఖలను సేవిస్తే ఆళ్వార్ల యందు అభినివేశం తిరువాయిమొళి యందు ప్రావణ్యం కలుగుతాయి.

ఆచార్య సార్వభౌములైన శ్రీవరవరమునులు భగవద్ రామానుజుల వారి పాదుకలలో వేంచేసి ఉంటారట. ఆ ఫణీంద్రావతారం ఆనాడు భగవద్రామానుజులుగా, తిరిగి మరొకమారు శ్రీమనవాళమామునులుగా అవతరించిరి. శ్రీమనవాళమామునుల జ్ఞాన వైభవాన్ని పలుకుచున్నారు. వీరి వాఖ్యానం, అవతల వారి హృదయాలలో నాటుకొనెట్లు సంప్రదాయబద్ధమైన అర్థాలు కలిగి ఉంటుందిట. వీరి బిరుదమే "విశదవాక్ శిఖామణి". ఇది నా అభిప్రాయం అన్నదే కనబడదుట. వారి వ్యాఖ్యానంలో ఏదో ఒక ప్రమాణం తప్పక ఉంటుంది.

వ్యాఖ్యాన చక్రవర్తి అయిన పెరియ వాచ్చాను పిళ్లై గారు నాలాయిరం వ్యాఖ్యానాన్ని అప్పటికే అనుగ్రహించారు. ఏ కారణం చేతనో ! అందులో కొంత భాగం లుప్తం అయిందని మణవాళ మామునులు దానికి వ్యాఖ్యానాన్ని అనుగ్రహించారట! అది దర్శించిన మామునుల శిష్యులలో ఒకరు ఇలా అనుకున్నారట! "వ్యాఖ్యానం అంతటికి చెదపట్టేసి ఉంటే మామునులు ప్రబంధం అంతటికీ వ్యాఖ్యానాలు అనుగ్రహించి ఉండి ఉండేవారు కదా! లోకానికి మధురతమమైన దివ్య సూక్తులు లభించేవి కదా!" అని.మనవాళ మామునుల వ్యాఖ్యానాలు సేవిస్తే అంత మధురంగా ఉండేవట! అందువలన భగవత్ రామానుజుల వారి పాదుకలను సేవిస్తే "వ్యాఖ్యాన వైభవం" లభిస్తుంది. ★

## డాక్టర్ శ్రీమాన్ సముద్రాల రంగ రామానుజాచార్యుల వారికి

# గోపాలోపాయన పురస్కారం





శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో జీవా ప్రాంగణంలో ప్రతి సంవత్సరం శ్రీ ఉ.వే శ్రీమాన్ గోపాలాచార్య స్వామి వారి తిరునక్షత్రం రోజున గోపాలోపాయన పురస్కారం నిర్వహించబడుతుంది. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి గురువులైన శ్రీమాన్ తే.కం గోపాల చార్య స్వామి వారి స్తుతి, స్మృతి పురస్సరంగా నిర్వహింపబడే ఈ కార్యక్రమంలో సాంప్రదాయ విద్వాంసులకు సన్మానం సాంప్రదాయ గ్రంథావిష్కరణలు జరుపబడతాయి. 1997 వ సంవత్సరం నుండి నిర్వహింపబడుతున్న ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ సంవత్సరం ఫిబ్రవరి 2న జీవా సాకేత మండపంలో మహా మహోపాధ్యాయ డాక్టర్ శ్రీమాన్ సముద్రాల రంగ రామానుజాచార్యుల వారికి గోపాలోపాయన పురస్కారాన్ని అందజేశారు.

శ్రీ ఉ.వే శ్రీమాన్ తె.కం గోపాలాచార్య స్వామి వారు శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారికి, శ్రీ శ్రీ శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారికి ప్రత్యక్ష గురువులు మరియు మార్గదర్శకులు కూడా! మరెందరో సాంప్రదాయ సర్వజ్ఞులకు కూడా వారు గురువులు. సంప్రదాయ ప్రచారంలో వారి శ్రమ,తపన శ్లాఘనీయం అని పెద్దలు ప్రశంసిస్తారు. సంప్రదాయ ప్రవర్తన, ప్రచారంతో నిండిన వారి జీవన గతి శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి వారితో కలిసి సాగింది. ఇద్దరిదీ విడదీయరాని సంబంధం అని అందరూ భావిస్తారు. గొప్పవారి జీవిత చరిత్ర అంటే అది ఆనాటి సమకాలీన సమాజ చరిత్రనే అవుతుంది. అలాగే శ్రీమాన్ శ్రీ గోపాలాచార్య స్వామి వారి జీవితం అంటే సమకాలీన సమాజ ఆధ్యాత్మిక చైతన్యమే అవుతుంది. అందుకే నేటి ఆచార్యులే కాకుండా సాంప్రదాయ సర్వజ్ఞులైన అందరిపైనా శ్రీమాన్ గోపాలచార్య స్వామి వారి ప్రభావం ఉంటుంది.

ఈ పురస్కార మహోత్సవం సందర్భంగా వారి జీవనగమనంలో సాధించిన అమూల్య విషయాలను గుర్తుచేసుకున్నారు. ఈ సంవత్సరం గోపాలో పాయన పురస్కార గ్రహీత డాక్టర్ సముద్రాల వేంకట రంగరామానుజా చార్యులు, 05.08.1949, పెద్దవరం, రేపల్లె, గుంటూరులో జన్మించారు. వీరి ధర్మపత్ని శ్రీమతి సూర్యకుమారి. విద్యాభ్యాసం సంస్కృత కళాశాల, కొవ్వూరులో 1967-70 వరకు జరిగింది. ఆంధ్రయూనివర్సిటీ, విశాఖలో 1974-76 పి.హెచ్.డి చేశారు.

కొవ్వూరు సంస్కృత కళాశాలలో 1973 నుండి 2007 వరకు లెక్చరర్, రీడర్గా, ప్రిన్సిపాల్గా పనిచేశారు.

తిరుపతి వైదిక విశ్వవిద్యాలయంలో సంశోధన ప్రకాశన విభాగంలో విశేషాధికారిగా, భక్తినివేదన సంపాదకులుగా 10 సం.లు, ఉభయవేదాంతాచార్య పీఠ కార్యదర్శిగా, అధ్యక్షులుగా 26 సం.లు సేవలు అందించారు. ప్రస్తుతం జీవా గ్రంథప్రకాశన విభాగ వర్తమాన డైరెక్టర్గా ఉన్నారు. ఇంతవరకు భగవద్రామానుజ గ్రంథాలపై తెలుగు అనువాద వ్యాఖ్యానాలు 70కి పైగా గ్రంథరచనలు చేశారు.

వీరి విశిష్ట సేవలకు ఎన్నో పురస్కారాలు లభించాయి. లభించిన పురస్కారాలు బిరుదులలో ముఖ్యమైనవి మహామహోపాధ్యాయ, శాస్త్రభాస్కర, ప్రెసిడెంట్ అవార్డ్, శాస్త్రవిద్వన్మణి, శాస్త్రరత్నాకర, గోపాలదేశిక పురస్కార, శ్రీభాష్యం అప్పలాచార్య అవార్డు, శ్రీరఘునాథ దేశిక పురస్కారం, శతావధాని కృష్ణమాచార్య అవార్డులు లభించాయి.

# పావన గంగోత్రి ఆశ్రమం



దేవభూమి ఉత్తరాఖండ్‌లోని పరమ పావన పుణ్య భూమి గంగోత్రి. హిమాలయాల్లోని భాగీరథీ పర్వత శ్రేణులలో గోముఖం నుండి విష్ణుపాదజనని, పరమపావని పాపనాశిని అయిన గంగానది ఉద్భవించిన పరమ పవిత్ర ప్రదేశం. ఇది ఆచార్యుల పాదస్పర్శతో పులకించిన పుణ్యభూమి, పచ్చని ప్రకృతి సరస్సులతో అతి మనోహరమై అలరారే దివ్య తపోభూమి. మానవులకు తమ పాపాల నుండి ముక్తిని అందించి ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసాదించే దేవభూమి. చార్ధామ్‌గా ప్రసిద్ధిగాంచిన బద్రీనాథ్, కేదార్నాథ్, గంగోత్రి, యమునోత్రి ప్రముఖ క్షేత్రాలు. ఎంతో మంది మహనీయులు ఇక్కడ తపస్సు ఆచరించి భగవదనుగ్రహాన్ని పొందుతారు. భగవద్రామానుజాచార్యులు ఆసేతు హిమాచలం పర్యటిస్తూ పావన గంగోత్రి క్షేత్రానికి విజయం చేశారట, అక్కడ నేటికీ జగదాచార్యుల శిష్యపరంపరగా ఆచార్య పీఠం కొనసాగుతూ ఉంది. గంగోత్రి ఆచార్య పీఠ నివాసులైన శ్రీశ్రీశ్రీ గంగోత్రి రామానుజాచార్య స్వామివారి అనుగ్రహ భాషణంగా అక్కడి విశేషాలు తెలుసుకుందాం.

“భగవదాచార్యులు రామానుజుల వారు గంగోత్రి ధామాన్ని విజయం చేసినప్పుడు ఒక గుహాలయంలో కూర్చుని అనుష్ఠానం చేసుకునే వారట. ఆ గుహాలయాన్ని ఆ స్థలాన్ని మా పూర్వాచార్యులు ఇప్పటివరకు గుహను తత్సంబంధిత ఆ భూభాగాన్ని పరిరక్షిస్తూ అక్కడే ఆరాధనా క్రమాన్ని, మూలమంత్ర ఉపాసనను చేసుకుంటూ వచ్చారు. పూర్వం మాజీ గవర్నర్ వెంకట్రామన్ గారి గురువులు కృష్ణ ప్రసన్నాచార్యులవారు కూడా ఆచార్యకుటీర పూర్వ


ఆచార్య కుటీర్ ఆశ్రమం

పీఠాధితులు. ఆ సమయంలోనే లక్ష్మీనారాయణ మందిరాన్ని, కొన్ని కుటీరాలని ఏర్పరచడం జరిగింది. ఎవరైనా శ్రీ వైష్ణవులు గంగోత్రి ధామానికి వచ్చి గంగా నది ఒడ్డున అష్టాక్షరి ఉపాసన చేయాలి అని అనుకునే వారికి ఆ కుటీరాల్లో వ్యవస్థ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ భాగవతోత్తములకు ప్రసాద సేవను ఆచార్య కుటీరం నిర్వహిస్తోంది. కృష్ణ ప్రసన్నాచార్యుల వారి తర్వాత ఉత్తరాఖండ్ పీఠాధితులు శ్రీశ్రీశ్రీ కృష్ణమాచార్యులవారు ఆచార్య కుటీరంలో ఉండి తపస్సు ఆచరించారు. భగవదాచార్యుల వారి గుహ పైభాగంలో ఆదిశేషుల పడగలాంటి మరో గుహలో అక్కడే ఉంటున్న ప్రహ్లాదాచార్యులవారు ఒక కాంతిని చూసి అక్కడ ఒక దివ్యమైన అనుభూతిని పొంది ఆ పడగ నీడన ఉన్న గుహని పునరుద్ధరించమని మమ్మల్ని ఆదేశించారు. మరొక గుహలో మేము అనుష్ఠాన, నిత్యారాధనలు కొనసాగిస్తూ గంగోత్రిని దర్శించడానికి వచ్చిన భాగవతులకు సేవ చేస్తున్నాం. “తవ తట నికటే యస్య నివాసః ఖలు వైకుంఠే తస్య నివాసః” ఎవరైతే గంగానది ఒడ్డున నివాసం ఉంటారో వారు సాక్షాత్ శ్రీ వైకుంఠంలో నివాసం ఉన్నట్లే అని గంగాస్తవంలో చెప్పబడింది. ఈ దివ్య ప్రదేశంలో పూర్వ ఆచార్యులు ఎందరో మంచులో కూర్చుని కఠిన తపస్సును ఆచరించారు. ఈ పుణ్యభూమిని మనందరం దర్శించి భగవదాచార్యుల మరియు పూర్వాచార్యుల మంగళాశాసనాలను పొందాలి. గంగోత్రిలో గంగాదేవి ఆలయాన్ని, ఆ తర్వాత మన ఆచార్య కుటీరాన్ని, సూర్య కుండాన్ని, పాండవులు నివాసం ఉన్న పాండవుల గుహను, రామాలయాన్ని మహాత్ములు తపస్సు చేస్తున్న గుహలని సందర్శించుకుని వారిని సేవించి తరిద్దాం! ★



# ఆరోగ్యప్రదాత ఉత్తనూరు స్వామి






## శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ధన్వంతరి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులను ఆదుకోడానికి ఒక్కో క్షేత్రంలో ఒక్కో విధంగా అవతారప్రాశస్త్యాన్ని చాటుతున్నాడు. ఉత్తనూరు శ్రీవేంకటేశ్వరస్వామి ఆరోగ్యప్రదాత.

పన్నిద్దరాళ్వార్లతో నెలవైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీధన్వంతరి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కోవెల ఉత్తనూరు గ్రామం, జోగులాంబ గద్వాల జిల్లా. జనమే జయ మహారాజు అర్జునుని మనుమడు పరీక్షిత్ మహారాజు యొక్క శాప పరిహారార్థం ఈ ధన్వంతరి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రతిష్ఠంచ బడినది అని చరిత్ర. తరువాత కాలంలో శ్రీగోపాలదాసుల వారిచే స్తుతించి, సేవించబడిన పాశస్త్యం గల దేవస్థానం. మురహరి రాయలు మరియు వెంకటమ్మ అనే పుణ్యదంపతులకు 1721వ సంవత్సరంలో శ్రీగోపాలదాసుల వారు జన్మించారు. వీరికి భాగణ్ణదాసులు అని పేరు, సంకాపురగ్రామంలో తపస్సు చేసుకుంటూ అనేక గ్రంథాలను, సంకీర్తనలను వ్రాసి 'గోపాల విఠల' అనే బిరుదాంకితులైయ్యారు. తర్వాత ధన్వంతరి వేంకటేశ్వరుడు ఉత్తనూరు క్షేత్రంలో ప్రతిష్ఠితమై ఉన్నారని గుర్తించి, అప్పటి నుండి స్వామి వారి సన్నిధిలోనే వుంటూ స్వామి వారి కోసం అనేక సంకీర్తనలతో స్తుతిస్తూ, సేవిస్తూ వీరి గానామృతంతో



# ఆరోగ్యప్రదాత ఉత్తనూరు స్వామి






స్వామిని మెప్పించగా, స్వయంగా శ్రీవారే ఆయనకు దర్శనమిచ్చి. ఆయన పాటలకు ముగ్ధులై నాట్యమాడేవారని లోకోక్తి. వారిని అనుగ్రహించి అద్భుతమైన జ్ఞానశక్తిని అనేక వరాలను ప్రసాదించి నావునికిని లోకమంతట తెలియజేయమని చెప్పారట. అప్పటి నుండి అక్కడే తపస్సు చేస్తూ వుండేవారు. వారి శిష్యుడైన జగన్నాథదాసులకు విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. అప్పుడు వారికి "శ్రీ ధన్వంతరి లక్ష్మీవెంకటేశ్వర స్వామి వారు దేవత లందరికి 'ఏకైకవైద్యుడు, వైద్యో నారాయణోహరి:" అని అన్నట్లుగా సమస్త రోగాలను, దోషాలను, అనేక వికృతులు, అఘాతాలు, వ్రణాలు, సర్వబాధలను తొలగించి ఆరోగ్యమే మహా భాగ్యం అన్నట్లు అన్నిభాగ్యాలను ప్రసాదించి, ఆనందమైన జీవితాన్ని ప్రసాదించేవారు" అని శ్రీవారి ప్రాశస్త్యాన్ని తెలియజేసారు. వెంటనే జగన్నాథదాసులు శ్రీవారిని దర్శనం చేసుకోగా సర్వరోగాలు నశించాయి. అప్పటి నుండి భక్తులు స్వామి పిలిస్తే పలుకుతాడని నమ్మకంతో పూజించి కృపకు పాత్రులౌతున్నారు.

ఈ దేవాలయంలో అర్చకులుగా వాసుదేవ స్వామి, సత్య స్వామి, వెంకటేశ్వర స్వామి, దిలీప్ కుమార్ స్వామి, విష్ణు స్వామి, రవి స్వామి కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఎందరో భక్తులు దర్శించుకోవటానికి వస్తుంటారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు మాఘ శుద్ధ తదియ నుండి ఎంతో ఘనంగా జరుగుతాయి. ★

# తిరుమలలో వైభవంగా ధార్మిక సదస్సు



టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల ధార్మిక సదస్సు తిరుమలలోని ఆస్థాన మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత సదస్సుకు టీటీడీ ఈవో శ్రీ ఏవీ ధర్మారెడ్డి, టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ భూమన కరుణాకరరెడ్డి స్వాగతం పలికారు. దేశంలోని వివిధ మతాల నుండి వచ్చిన మఠాధిపతులు హిందూ ధర్మాన్ని మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి తమ విలువైన సూచనలను అందించారు.

ముందుగా తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ మరియు శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామీజీలు జ్యోతి ప్రజ్వలన చేయడంతో సభ ప్రారంభమైనది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ పీఠాధిపతుల విలువైన సూచనలతో టీటీడీ ద్వారా మరిన్ని ధార్మిక కార్యక్రమాలు అమలు చేసేందుకు ధార్మిక సదస్సు వేదిక కావాలని శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి అనుగ్రహ భాషణంలో ఆకాంక్షించారు.

తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, హెచ్‌హెచ్ తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామీ హైదరాబాద్, శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ విశాఖ శారదా పీఠం స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి, వ్యాసరాజ మఠానికి చెందిన శ్రీ శ్రీ విద్యా శ్రీశ తీర్థ, కుర్తాళం శ్రీ భారతీ తీర్థ స్వామి, శ్రీ లలితా పీఠం స్వామి, ఏర్పేడు శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి. కుక్కే సుబ్రమణ్య మఠంలోని శ్రీ విరజానంద స్వామి, కడప బ్రహ్మంగారి మఠంలోని శ్రీ విరజానంద స్వామి, గుంటూరు శ్రీ విశ్వయోగి విశ్వంజీ, తుని తపోవనం శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి, నెల్లూరు సత్యానంద ఆశ్రమంలోని శ్రీ హరి తీర్థ స్వామి, జ్ఞాన సరస్వతీ



# తిరుమలలో వైభవంగా ధార్మిక సదస్సు






పీఠాధిపతి శ్రీ శ్రీ ప్రకాశానంద సరస్వతి స్వామి. , చైతన్య తపోవనం మాతా శివానంద సరస్వతి, మాతా సుశ్రుసానంద, ప్రొద్దుటూరులోని శివ దర్శన మాతాజీ, ఉత్తరకాశీకి చెందిన శ్రీశ్రీశ్రీ స్థిత ప్రజ్ఞానానంద సరస్వతి స్వామి, చిదానంద ఆశ్రమం విజయవాడ శ్రీ శ్రీ సత్యానంద భారతి మొదలగు వారు ఈ కార్యక్రమానికి రావడం జరిగింది.

శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ మాట్లాడుతూ ఎస్వీబీసీ యూట్యూబ్ చానల్ ద్వారా ధార్మిక కార్యక్రమాలను సమాజంలోకి తీసుకెళ్లాలని, పుస్తకాలను ప్రచురించాలని సూచించారు. శ్రీవారి సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ మాట్లాడుతూ టీటీడీ ద్రావిడ వేదాన్ని కూడా ప్రోత్సహించాలన్నారు.

★






# తెలంగాణా కుంభమేళా మేడారం జాతర




**సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించే గ్రామం మేడారం ఏరియల్ వ్యూ**

ప్రకృతి శోభతో పరవశించిపోయే మారుమూల అటవీ ప్రాంతం మేడారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒక మారు సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ సమయంలో మేడారం జనంతో కిటకిట లాడుతోంది. సాధారణమైన ఒక చిన్న గ్రామానికి కోట్లాదిమంది భక్తులు జాతర జరిగిన మూడు రోజులు వస్తారంటే ఆశ్చర్యం కలుగుతుంది. సాధారణంగా ఈ గ్రామం జనాభా మూడువందలకు మించి ఉండదు. మేడారం గ్రామం ఎలా ఉందో తెలిసేలా తెలంగాణా ప్రభుత్వం జాతరకు ప్రభుత్వ గుర్తింపును ఇచ్చింది. మేడారం పేరుతో ఏర్పాటు చేసిన వెబ్ పేజీలో ఏరియల్ వ్యూను ఉంచింది. భక్తులు వెళ్లడానికి మార్గాన్ని తెలిపేలా తగు సూచనలను ఉంచింది. మేడారం జాతరకు కుంభమేళాను తలపించేలా భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్నవారు సైతం అమ్మకు మొక్కులు చెల్లించడానికి సమ్మక్క సారలమ్మ గద్దె వద్దకు వస్తారు. అంతేకాదు జాతరకు తరలి వచ్చే యాత్రికులు బండ్లలో కార్లలోనే కాదు హెలికాప్టర్లలో సైతం వస్తారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భక్తుల కోసం హెలికాప్టర్లను కూడా ఏర్పాటు చేసింది ఫిబ్రవరి 21 నుండి 24 వరకు జాతరకు సుమారు కోటికి మందికి పైగా భక్తులను తరలించారు. వీరి సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లను మేడారం గ్రామంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసింది. ఈ నాలుగు రోజులు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులందరూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. రాష్ట్ర గవర్నర్, మంత్రులు జాతరను తిలకించడానికి మొక్కులు చెల్లించుకోవడానికి రావడం ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రాలేని ప్రజలు ఆయా గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసుకున్న సమ్మక్క సారలమ్మ గద్దె వద్ద ప్రత్యేక జాతర నిర్వహించుకుంటారు. ఇలాంటి సందర్భంలో ప్రధాన దేవత అర్చన చేసే పూజారి కుటుంబాలు ఆయా గ్రామాలకు తరలివచ్చి సమ్మక్క సారలమ్మలను గద్దె పైకి ఆహ్వానించి పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఇంత ప్రతిష్ఠాకరమైన సమ్మక్క సారలమ్మలను భగవత్ స్వరూపంగా మలుచుకుని భక్తులు ఆదరించడం వెనక ప్రత్యేక కథనం ఉంది. వాస్తవంగా జరిగిన ఈ కథనం హృదయాలను కదిలించి భక్తి భావాన్ని పెంపొందింప చేస్తుంది.



**సమ్మక్క సారలమ్మ గద్దె**

# తెలంగాణ కుంభమేళా మేడారం జాతర



జాతర వేళ జంపన్న వాగువద్ద జనసందోహం

## చారిత్రక కథనం

ఇది కథ కాదు వాస్తవం. గిరిజనులు చేసుకునే పండగ ఉభయతెలుగు రాష్ట్రాలకు పండగ. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని మేడారంనకు ప్రాశస్త్యం తీసుకు వచ్చిన కథనం ఆద్యంతం ఆసక్తికరం. అన్యాయమైన చట్టానికి వ్యతిరేకంగా పాలించిన పాలకులతో తల్లి మరియు కుమార్తె సమ్మక్క, సారలమ్మల పోరాటాన్ని జ్ఞాపకం చేస్తుంది.

సమ్మక్క యొక్క అద్భుత శక్తుల గురించి అనేక ఆధారాలు ఉన్నాయి. గిరిజన కథనం ప్రకారం, సుమారు 13 వ శతాబ్దంలో, వేట కోసం వెళ్ళిన కొందరు గిరిజన నాయకులు పులుల మధ్య ప్రకాశవంతంగా వెలుగు రేఖలు వెదజల్లుతున్న పురిటి కందును (అప్పుడేపుట్టిన అమ్మాయి సమ్మక్క) కనుగొన్నారు. వెంటనే ఆమెను గిరిజనులు తమ నివాసానికి తీసుకెళ్లారు. అప్పుడు గిరిజన తెగ అధిపతి బాలికకు సమ్మక్క అని నామకరణం చేసి దత్తత తీసుకుని అల్లారు ముద్దుగా పెంచుకున్నాడు. క్రమంగా పెరిగిన సమ్మక్క గిరిజనుల రక్షకురాలిగా బాధ్యతను నిర్వర్తించడం ప్రారంభించింది. ఆమె గిరిజన పెద్ద పగిదిద్ద రాజును వివాహం చేసుకుంది. అప్పుడు పగిదిద్ద రాజు వరంగల్ కేంద్రంచేసుకుని దేశాన్ని పాలించారు. ఆమెకు వరుసగా ఇద్దరు కుమార్తెలు మరియు ఒక కుమారుడు కలిగారు. వారిని సారక్క, నాగులమ్మ, జంపన్నగా పిలుచుకునేవారు. తల్లి సమ్మక్క వలెనే జంపన్న గిరిజన యోధుడుగా ఎదిగాడు. కాకతీయ సైనికులతో జరిగిన పోరులో జంపన్న మృతి చెందిన ప్రాంతంలో ఉన్న వాగును ఇప్పటికీ జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. జంపన్న వాగు గోదావరి నదికి ఉపనది. చరిత్ర ప్రకారం, జంపన్న గిరిజన యోధుడు జంపన్న వాగు జంపన్న రక్తంతో గుర్తించబడిన ఎరుపు రంగులో కనిపిస్తుందని భక్తులు ఇప్పటికీ నమ్ముతారు. జంపన్న వాగు ఎర్రటి నీటితో పవిత్రంగా కనిపిస్తుంది. గిరిజనులను రక్షించే దేవతల త్యాగాన్ని గుర్తు చేస్తుందని మరియు సమ్మక్క, సారలమ్మ, జంపన్న ఆత్మలలో ధైర్యాన్ని ప్రేరేపిస్తుందని గిరిజనులు, జాతరకు వచ్చిన భక్తులు నమ్ముతారు. జంపన్న వాగుపై నిర్మించిన వంతెనను ఆగిరిజన యోధుని పేరుతో పిలుస్తారు. సైనికులతో జరిగిన యుద్ధంలో గిరిజనులను రక్షిస్తూ విజయం ప్రాప్తించేలా పాలకుల కనులు తెరిపించి సమక్క అదృశ్యమయింది. కుంకుమ పసుపు రూపంలో దర్శనం ఇచ్చింది. నాటి నుండి గిరిజనుల ఆరాధ్య దైవాలుగా సమ్మక్క సారలమ్మలు నిలిచారు. ఇప్పటికి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించిన వారి కోరికలు తీరుతాయని ప్రగాఢ నమ్మకం. ★



జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

# అబుదాబిలో అద్భుత మందిరం





అబుదాబిలో స్వామినారాయణ అద్భుత మందిరం ఆవిష్కృతమైంది. సంప్రదాయసిద్ధంగా నిర్మించిన స్వామినారాయణ మందిరాన్ని ఫిబ్రవరి 14న వ్యవస్థాపకులు మహంత్ స్వామి మహారాజ్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడి ప్రారంభించారు. స్వామినారాయణ మందిరంలో రాధా కృష్ణ, సీతా రాములు, శివ పార్వతులు, జగన్నాథ్ స్వామి, వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి కొలువయ్యారు. సుమారు 400 మిలియన్ దిర్హామ్స్ వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. 1997లోనే ప్రముఖ్ స్వామి మహారాజ్‌కు ఆలయాన్ని యుఏఈలో నిర్మించాలని ఆలోచించారు. అయితే 2015



ఆగస్ట్‌లో యుఏఈ ప్రభుత్వం మందిరానికి భూమిని అందజేయడానికి ముందుకు వచ్చింది. ఇందుకోసం 27 ఎకరాల భూమిని బహుమతిగా ఇచ్చారు. అనంతరం డిసెంబర్ 2019లో నిర్మాణం ప్రారంభించారు. మందిరం నిర్మాణానికి రాజస్థాన్ నుండి పింక్ ఇసుకరాయి మరియు ఇటలీ నుండి పాలరాయి తరలించారు. మందిరం 108 అడుగుల పొడవు, 262 అడుగుల పొడవు మరియు 180 అడుగుల వెడల్పుతో సర్వాంగసుందరంగా నిర్మించారు. యూఏఈ లోని ఏడు ఎమిరేట్స్‌కి ప్రతీకగా ఏడు శిఖరాలు ఏర్పాటు చేశారు. రామాయణం, మహా భారతం, భాగవతం, శివ పురాణాల నుంచి కథలను వివరించే ఏడు మందిరాలు కూడా ఉన్నాయి. ఈ శిఖరాల మీద వేంకటేశ్వర స్వామి, నారాయణుడు, జగన్నాథుడు, అయ్యప్ప మూర్తులను అందంగా మలిచారు. పంచ భూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం మూలకాలని సూచించే విధంగా డోమ్ ఆఫ్ హార్మోని సాంకేతికంగా నిర్మించారు. ఈ ఆలయం ప్రధాన ద్వారం దగ్గర అయోధ్య రామ మందిర నమూనాని ఏకశిలపై రూపొందించారు. ఆలయం 108 అడుగుల ఎత్తుతో హిందూ సంప్రదాయానికి అనుగుణంగా నిర్మించారు. పశ్చిమాసియా లో ఇది అతిపెద్ద హిందూ దేవాలయంగా వాసికెక్కుతుంది అనడంలో అతిశయోక్తిలేదు. మందిర ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్షప్రసారాన్ని కూడా చేశారు. ★



# అరసవల్లి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు

రథసప్తమి ఉత్సవాలు భారతదేశంలోని వివిధ సూర్యదేవాలయాలలో నిర్వహించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లిలోని సూర్యదేవాలయంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ముఖ్యంగా ఉత్తరాయణ ప్రారంభం అయినాక కొన్నిరోజులు సూర్యకాంతి నేరుగా స్వామి మీద పడే అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు. దేవాలయంలో సంవత్సరానికి రెండు పర్యాయాలు సూర్య కిరణాలు ఉదయసంధ్యలో గర్భ గుడిలో ఉన్న మూలవిరాట్టు పాదాలకు సోకేలా నిర్మించబడటం ఒక ప్రత్యేకత. అరసవల్లి దేవస్థానం ప్రాంగణం అనివెట్టి మండపం, ధ్వజస్తంభం నుంచి సుదర్శన ద్వారం మధ్యలో తొలి కిరణాలు గర్భగుడిలోకి మూలవిరాట్టు ఆదిత్యుని శిరస్సును స్పృశిస్తాయి. ఆదిత్యునిని సూర్యకిరణాలు తాకిన వైనాన్ని తిలకించేందుకు తండోపతండాలుగా భక్తకోటి అరసవల్లికి తరలివస్తారు. సకల జీవులకూ సంక్షేమాన్ని, ఆయురారోగ్యాలనూ, ప్రసాదించే ఈ స్వామివారి ఇరు చేతులూ అభయ ముద్రలోనే ఉంటాయి. మామూలు రోజులతో పోలిస్తే మాఘ, వైశాఖ, కార్తీక మాసాల ఆదివారాల్లో ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అలాగే ఉత్తరాయణ, దక్షిణాయన మార్పుల్లో భాగంగా ప్రతిఏటా మార్చి 9, 10, 11, 12 తారీఖుల్లోనూ, అక్టోబరు 1, 2, 3, 4 తేదీల్లోనూ, తొలికిరణాలు తాకుతాయి ఈ దృశ్యాన్ని తిలకిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

భారత దేశంలో సుప్రసిద్ధ సూర్యదేవాలయాలుగా ఒడిశాలోని కోణార్క్ సూర్య దేవాలయం, తమిళనాడు మరియు అస్సాంలోని నవగ్రహ దేవాలయాల సమూహాలలో సూర్య దేవాలయాలు ఉన్నాయి. ఒడిశాలో మరొక సూర్య దేవాలయం ఉంది, ఇది బిరంచినారాయణ ఆలయంగా వాసికెక్కింది. రథ సప్తమి సందర్భంలో వివిధ దేవాలయాలలోని దేవతామూర్తులను సూర్యనారాయణుని స్వరూపంగా భావిస్తూ వూరేగిస్తారు. తిరుమలలో స్వామివారికి కూడా ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ★









# వైభవంగా అక్క కొండ స్వామి జాతర

భక్తుల కోర్కెలు తీర్చే అక్క కొండ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు జరిగిన ఉత్సవాలకు తండోపతండాలుగా భక్తులు ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి తరలి వచ్చారని ఆలయ ప్రధాన అర్చకులు వద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. నిర్మల్ కడెం మండలంలోని దిల్దార్ నగర్ అటవీ ప్రాంతంలో అక్కయ్య కొండపై లక్ష్మీనరసింహస్వామి వెలిసిన కథనాన్ని స్థలపురాణాన్ని ఆయన వివరించారు. స్వామివారి కళ్యాణం సందర్భంగా స్థానిక మండల ప్రజలు, దేవలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయ మహత్యం గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. ఈ దివ్యక్షేత్రమునకు నిర్మల్ నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నలు మూలల నుండి అనేక భక్తులు వచ్చి వారి ఇష్టదైవమైన శ్రీ అక్కకొండ లక్ష్మీ నరసింహస్వామిని భక్తితో సేవించి తరిస్తుంటారు. మాఘ శుద్ధ ద్వాదశి రోజున స్వామి వారి కళ్యాణోత్సవం మాఘ పున్నమి రోజున రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలలో అనేక మంది భక్తులు పాల్గొని శ్రీ నారసింహుని నామ స్మరణ, భజనలు చేసి తన్మయులయ్యారు. సంతానము లేని వారు శ్రీలక్ష్మీ నృసింహుని మనసార దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. స్వామివారి కళ్యాణం రోజున గరుడ ముద్దలు అందుకున్న వారి కోర్కెలు నెరవేరుతాయని ప్రగాఢ నమ్మకం. ★

# మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు





వేములవాడ శివాలయం. కోలువైన శ్రీ రాజరాజేశ్వరస్వామి

శివ శివ అంటే పాపాలు పటాపంచలు అవుతాయని, శివరాత్రి జాగరణ జన్మజన్మల పాపాలను హరిస్తుందని భక్తుల విశ్వాసం. అదేవిధంగా శివరాత్రి ఉపవాసముండి, జాగరణ చేసి, శివపూజ చేసి, శ్రీశైల శిఖరదర్శనం చేసి, పంచాక్షరి పఠించాలని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందరూ శ్రీశైలం దర్శనానికి వెళ్లడం సాధ్యంకాదు కనుక ప్రసిద్ధ శైవక్షేత్రాలకు, ఆలయాలకు వెళ్లాలని మక్కువ పడుతారు. వేములవాడ, కాళేశ్వరం, శ్రీకాళహస్తి ఇలా చెప్పుకుంటూ వెళితే ఎన్నో శైవక్షేత్రాలలో, వాడవాడలా నెలకొన్న శివాలయాలలో శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు.

మహాశివరాత్రికి ఉభయతెలుగు రాష్ట్రాలలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఈ సారి శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో వారంరోజుల ముందు నుంచే ఆలయాలను ముస్తాబు చేస్తున్న సందర్భాలున్నాయి. మహా శివరాత్రి ఉత్సవాలు తెల్లవారుజాము 4గంటల నుంచే ప్రారంభమవుతాయి.







శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలం క్షేత్రం ముస్తాబు

# మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు




మేలుకొలుపు, గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 7.15గంటలకు శివపార్వతుల కళ్యాణం, అర్ధరాత్రి 12.05 గంటలకు లింగోద్భవ కార్యక్రమం తదితర పూజలు జరుగుతాయి. అర్ధరాత్రి వేళ శివునికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారు.

**శ్రీశైలం**

శ్రీశైలంలో మార్చి 1వ తేదీ నుంచి 11 వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు చకాచకా ఏర్పాట్లు చేస్తున్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున శైవ భక్తులు తరలిరానున్నారు. మార్చి 1వ తేదీ ధ్వజారోహణం, శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారుల పట్టువస్త్రాల సమర్పణ, మార్చి 2. భృంగీ వాహన సేవ, మార్చి 3. హంస వాహన సేవ. విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాల సమర్పణ, మార్చి 4. మయూర వాహన సేవ. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాల సమర్పణ, మార్చి 5. రావణ వాహన సేవ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టువస్త్రాల సమర్పణ, మార్చి 6. పుష్ప పల్లకీ సేవ, మార్చి 7. గజ వాహన సేవ, మార్చి 8. మహాశివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కల్యాణోత్సవం.మార్చి 9. రథోత్సవం, తెప్పోత్సవం, మార్చి 10. ధ్వజావరోహణం, మార్చి 11. అశ్వ వాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు దిగిన చోట నుంచి ఆయా కూడళ్లకు వెళ్లేందుకు దేవస్థానం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తుందని ఈఓ పెద్దిరాజు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సంఖ్య అత్యధికంగా ఉంటుందని, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయన్నారు. అన్ని సత్రాల నిర్వాహకులు బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందే భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. అన్నదానం కోసం వంటకాలు వండుతున్నప్పుడు, అన్నదానం సమయంలో కూడా శుచీశుభ్రతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని దేవాలయ పాలక మండలి ఇటీవల నిర్వహించిన సమావేశంలో తగు సూచనలను సలహాలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఫిబ్రవరి 22 గురువారం ఆలయ చైర్మన్ చక్రపాణి రెడ్డి అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాదయాత్ర మార్గంలోని భీమునికొలను, కైలాసద్వారం మార్గంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

'శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' శ్రీశైలశిఖరం దర్శనం చేసుకుంటేనే మరోజన్మఉండదు. యథార్థం ఏమిటంటే, శిఖరమంటే గుడిగోపురం కాదు. శిరశ్శిఖర ముచ్యతే అన్న మాటను ప్రామాణికంగా పరిశీలిస్తే, శిరస్సే శిఖరం. ఎవరైతే తన శిరస్సునందు శ్రీశైలున్ని దర్శిస్తారో వారికి పునర్జన్మ వుండదని ఆ వాక్యానికి అర్థం. ఇది నిజమైన సాధన. ఇది నిజమైన యోగం. మనస్సునూ, మనో ప్రక్రియలను కట్టి వేస్తే యోగసాధన సాధ్యమైతే పరమేశ్వరుని దర్శనం సుసాధ్యం. దీనివల్ల మానసిక ప్రశాంతత. జన్మరాహిత్యం కూడా సుసాధ్యమే సుమా! శివయ్య లీలలు ఇంతా అంతా కాదు అన్యాపదేశంగా ఒక్కోమారు అన్నా భక్తుడు పిలుస్తున్నాడు ఆదుకోవాలి అని శివ శివ అన్న

# మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు

వారినందరి శివరాత్రిరోజు శివుడు కరుణిస్తాడు!

**కాళేశ్వరం**

కాళేశ్వరం తెలంగాణాలో ప్రసిద్ధ శైవక్షేత్రం. కాళేశ్వరుడు అంటే యముడు. అలాంటప్పుడు ఇది శైవక్షేత్రం ఎలా అయిందన్న సందేహం కలుగుతుంది. కానీ స్థలపురాణం గమనిస్తే భక్తులకు వాస్తవం గోచరం అవుతుంది. ఆలయంలోకి వెళ్లగానే తొలుత కాళేశ్వరుడిని పూజించి ఆ తర్వాత ముక్తేశ్వరుడిని కొలిస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందనేది ఒక నమ్మకం. అయితే ముక్తేశ్వర స్వామిని (శివుని) దర్శించుకున్న భక్తులకు ఆయన ముక్తిని ప్రసాదించడంతో.. యముడికి పనిలేకుండా పోయిందట. దీంతో యముడు శివుడితో మొరపెట్టుకున్నాడని పురాణకథనం. యముని మొర ఆలకించిన శివుడు తన పక్కనే లింగాకారంలో కొలువుదీరమని ఆదేశించాడట. అలా లింగాకారంలోకి మారిపోయాడు కాళేశ్వరుడు. అయితే కాళేశ్వరం వెళ్లేవారు లింగాకారంలో ఉన్న యముడిని కొలవకుండా వెళ్లిపోతే ముక్తి దొరకదనేది ప్రతీతి. అందుకే శివుని పక్కనే యముడు రెండు లింగాలు దర్శనం ఇస్తాయి. ఇక్కడ దర్శనం ఇచ్చిన లింగానికి రెండు రంధ్రాలు కనిపిస్తాయి. వాటిలో ఎన్ని నీళ్లు పోసినా నిండవు. పోసినవి పోసినట్లు గోదావరి, ప్రాణహిత సంగమంలో కలుస్తాయని భక్తుల నమ్మకం పురాణ ప్రవచనం.

**వేములవాడ**

వేములవాడ దక్షిణ కాశీగా పిలువబడుతున్న తెలంగాణ రాష్ట్రం, రాజన్న జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఇది హైదరాబాద్‌కు 160 కిలోమీటర్ల దూరంలో తెలంగాణాలోని ప్రముఖ పట్టణమైన కరీంనగర్‌కు 36 కిలోమీటర్ల దూరంలో ఉంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం పౌరాణికంగా, చారిత్రాత్మకంగా విశిష్టతలను సంతరించు కుంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కరీంనగర్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధర్మపురి పట్టణంలో శ్రీరామచంద్రస్వామి ప్రతిష్ఠించిన సైకత లింగం ఉంది. ఈ శివాలయం కూడా ప్రసిద్ధి చెందినది. సాధారణంగా ఈ రెండు క్షేత్రాలను ఒకే రోజు యాత్రికులు సందర్శించడం ఆనవాయితీగా ఉంది.




వేములవాడ దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేతుడై స్వామి వెలసి నిత్యం పూజలందుకుంటున్నాడు. భాస్కర క్షేత్రంగా పిలవబడే ఈ క్షేత్రం గురించి భవిష్యోత్తర పురాణంలోని రాజేశ్వరఖండంలో ఉంది.

శివరాత్రి రోజున లక్షలాది భక్తులు వేములవాడ రాజన్న స్వామిని దర్శించుకోవడం తెలంగాణాలో ఆనవాయితీ. ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. మహాలింగార్చన ప్రత్యేక పూజగా చెప్పుకుంటారు, స్వామికి నిర్వహించే పూజలలో అన్నపూజ ప్రధానమైనది. అర్ధరాత్రి రాత్రివేళ దీపాల అలంకరణలతో దేవాలయం దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటుంది. కాశీ, చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరంలను పావనం చేసిన తరువాత శివుడు వేములవాడ వేంచేసాడని పౌరాణిక కథనం.

మూలవిరాట్టు రాజన్నకు కుడి పక్కన శ్రీ రాజ రాజేశ్వరీ దేవి, ఎడమ పక్కన శ్రీ లక్ష్మీ సహిత సిద్ధి వినాయక విగ్రహాలు ఉంటాయి. ధర్మగుండం కోనేటిపై మూడు మండపాలు నిర్మించబడ్డాయి. మధ్య దానిపై ఈశ్వరుని విగ్రహం ప్రతిష్ఠించబడింది. కోడె మొక్కు ప్రధానమైనది. భక్తులు గిత్తను తీసుకువచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రాంగణంలో ఒకచోట కట్టివేస్తారు. దీనివలన భక్తుల పాపాలు తొలగిపోయి సంతాన ప్రాప్తి కలుగుతుందని ప్రగాఢనమ్మకం. అపమృత్యు దోషం పోవాలంటే ఇక్కడ గండ దీపాన్ని వెలిగించాలని భక్తుల విశ్వాసం. ★

# వైభవంగా శ్రీశైలంలో మహాకుంభాభిషేకం



శ్రీశైల క్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు ఫిబ్రవరి 21న వైభవంగా ముగిసాయి. ఫిబ్రవరి 16న మహాకుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కంచికామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతీ, శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య, పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతీ, కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి మహాకుంభాభిషేకంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానాలయంలో శివాజీగోపుర పునర్మిర్మాణం, ఉపాలయాల పునరుద్ధరణ, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం నిర్వహించారు. కుంభాభిషేకం నిర్వహణ వల్ల చతుర్విధ పురుషార్థసిద్ధి, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక పరిపుష్టి, ఆయుర్వృద్ధి, కీర్తి జయం కలుగుతాయని, శారీరక, మానసిక వ్యాధులు నశిస్తాయని, సకల ఆపదలు తొలుగుతాయని పీఠాధిపతులు అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి, అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు. ★


# దొంగతుర్తి శ్రీ గోదా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి పునః ప్రతిష్ఠ



పెద్దపల్లి జిల్లా దొంగతుర్తి గ్రామంలో లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయం పునర్నిర్మాణం మరియు ప్రతిష్ఠా మహోత్సవం ఎంతో వైభవముగా జరిగింది. 300 సంవత్సరాల క్రితము సముద్రాల ముత్యంరావు గారు ఈ ఆలయాన్ని నిర్మించారు. నేడు ఆలయ జీర్ణోద్ధరణం చేసి వారి వంశీయులు సముద్రాల అశోక్, వారి అన్నదమ్ములు పునర్నిర్మాణ, ప్రతిష్ఠలు చేయించారు. ★



# శ్రీభీర్పూరు లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం కమనీయం






శ్రీభీర్పూరు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో కళ్యాణం కమనీయంగా జరిగింది. భీష్మ ఏకాదశి మరునాడు రాత్రి బీర్పూరు గుట్టపై జరిగిన కళ్యాణ మహూత్సవానికి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. కొబ్బరి బెల్లాలు ఇవిగో నర్సయ్య అంటూ స్వామి వారి కళ్యాణానికి తలువాల బియ్యం తీసుకుని సమీప గ్రామల ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు, దేవాదాయశాఖకు చెందిన అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతియేటికంటే ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చారు. సుదూర ప్రాంతాలనుంచి కూడా భక్తులు వచ్చి సుమారు అటవీ ప్రాంతలో వచ్చి విడిది చేసి ఉండటం ప్రత్యేకత. ★



# వైభవంగా శ్రీనంబులాద్రి స్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీనంబులాద్రి స్వామి బ్రహ్మోత్సవాలు మాఘ శుద్ధ ఏకాదశికి ఫిబ్రవరి 21 నుండి 26 వరకు వైభవంగా జరిగాయి. పెద్దపల్లి పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో దేవునిపల్లిలోని నంబులాద్రి గుట్టపై ఈ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సుల్తానాబాద్ మండల వాసులేకాకుండా తెలంగాణాలోని పలు ప్రాంతాలనుంచి ఉత్సవాలకు విచ్చేసిన భక్తులు స్వామి వారిని సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఫిబ్రవరి 26 సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ★






వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 17న పల్లకి సేవలో పాల్గొన్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

# కన్నుల పండుగగా కరీంనగర్‌లో శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవములు

కరీంనగర్ పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవములు ఫిబ్రవరి 14 నుండి 21 వరకు వైభవంగా జరిగాయి. ఉత్సవాలకు శ్రీమాన్ గుదిమెళ్ళ విజయకుమారాచార్యులు (కృష్ణ యజుర్వేద పండితులు) ప్రత్యక్ష పర్యవేక్షణ వహించారు. 18న "శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనారాయణస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం' భక్త జనసందోహంతో వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవ ప్రారంభ కార్యక్రమాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అంకురార్పణ చేశారు. అంతేకాకుండా స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఉత్సవాలకు విచ్చేసారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం 9 గంటలకు యాగశాలలో నిత్య హోమములు, గరుడ వాహన సేవను నిర్వహించారు. స్వామి వారి సేవాకార్యక్రమాలలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాలుపంచుకున్నారు. వైదిక కార్యక్రమాలు చక్రవర్తుల లక్ష్మీనారాయణాచార్యులు (ముఖ్య అర్చకులు), చెన్నోజ్వల నాగరాజాచార్యులు (అర్చకులు) గార్ల వైదిక నిర్వహణలో బ్రహ్మోత్సవములు వైభవంగా కన్నుల పండుగగా జరిగాయి. ★







# బాలవిజ్ఞానం

# దారి దీపం

అనంతుడు చిన్నతనం నుంచి ఎంతో గారాబంగా పెరిగాడు. పసితనంలోనే తండ్రిని కోల్పోవడం వల్ల తల్లి అతన్ని మరింత అపురూపంగా చూసుకుంది. చక్కని విద్య తెలివితేటలు ఉన్నప్పటికీ మొహమాటం, బెరుకు ఎక్కువగా ఉండడం వల్ల అందరితో కలిసేవాడు కాదు. ఒక చిన్న బియ్యం వ్యాపారి వద్ద లెక్కలు రాస్తూ తనకున్న ఐదెకరాల నేలలో వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. అతనికి వివాహమై ఒక కుమారుడు జన్మించిన తర్వాత అతని తల్లి కూడా మరణించింది. బంధువులతో స్నేహితులతో ఎక్కువగా కలవని అనంతుడు తల్లి దూరమైన తర్వాత ఎంతో కృంగిపోయాడు. ఎప్పుడు విచారంతో సరిగ్గా పని చేయక పోవడంతో యజమాని పనిలోంచి తీసేసాడు. వర్షాలు కురవక బావిలో నీళ్లు తగ్గి వ్యవసాయం కూడా కష్టమైంది అతని వాలకం చూసి అతని భార్య కూడా చింతించేది.

వీరి దుస్థితి చూసి మేనమామ ఒక సలహా ఇచ్చాడు. పక్క ఊరిలో గల ఒక స్వామీజీ వద్దకు వెళ్లి కష్టాలను వివరించి పరిష్కారం తెలుసుకోమన్నాడు. అనంతుడు మేనమామ మాట విని స్వామీజీ వద్దకు వెళ్లాడు. కొంత బెరుకుగానే తన దుస్థితిని స్వామీజీకి విన్నవించాడు. స్వామీజీ ఒక పరిష్కార మార్గాన్ని సూచించాడు. అనంతుని పొలంలో వాళ్ల పూర్వీకులు నిర్మించిన చిన్న శివాలయం ఉండేది. అతని తండ్రి హయాం వరకు ఆయనే స్వయంగా పూజలు చేసేవాడు. కానీ అతని తర్వాత ఆ దేవాలయం పాడు బడింది అది తెలుసుకున్న స్వామీజీ ప్రతిరోజు ప్రొద్దున మరియు రాత్రివేళ దీపారాధన చేసి శివునికి పూజ, నివేదన చేయమని చెప్పాడు. అనంతుడు సరేనని తిరిగి వచ్చి శివాలయాన్ని పరిశుభ్రం చేసాడు. ఉదయం పూట పూజ, దీపారాధన చేసేవాడు. కానీ రాత్రి చీకటిలో వెళ్లి దీపం వెలిగించడం చాలా కష్టంగా ఉండేది స్వామీజీ మాట పాటించాలి కనుక రాత్రివేళ దారి దీపాన్ని పట్టుకొని పొలంలోకి వెళ్లేవాడు కానీ గాలికి దీపం నిలవడం కష్టం అయ్యేది. అందువల్ల పెద్ద కాగడా పట్టుకొని వెళ్లేవాడు. అయినా చీకటిలో వెళ్లాలంటే భయపడేవాడు. మళ్లీ దాంతో ఏమిచేయాలో తోచక మళ్లీ స్వామీజీ వద్దకు వెళ్లాడు. ఈసారి స్వామీజీ ఆంజనేయస్వామి స్తుతించే ఒక శ్లోకం చెప్పి దాన్ని చదువుతూ చీకటిలో



వెళ్ళమని చెప్పాడు. ఆ విధంగా ప్రతిరోజు చీకటిలో కాగడా వెలిగించుకొని శ్లోకం చదువుతూ శివాలయం వెళ్లి పూజ చేసి దీపారాధన చేసేవాడు


ఈ విధంగా కొన్నాళ్లు గడిచింది. అనంతనిలో భయం బెరుకు పోయి ఆత్మవిశ్వాసం పెరిగింది. నెమ్మదిగా తల్లిని మరిచిపోసాగాడు. తనలోని మార్పును తాను తెలుసుకోగలిగాడు. ఎంతటి కష్టాన్ని అయినా ఆ శ్లోకాన్ని చదువుకుంటే దాటగలనని భావించుకున్నాడు. తిరిగి యజమానిని కలిసి మళ్లీ పనిలోకి వెళ్ళసాగాడు. శివుని భక్తితో మొక్కి పొలంలో పెద్ద బావిని తవ్వించాడు. పూర్వం తన తండ్రి ఎలా వ్యవసాయం చేసేవాడో కొందరు ఊరిలోని వృద్ధులను కనుక్కొని ఆ విధంగానే చేయసాగాడు. కొద్ది రోజుల్లోనే అనంతుని స్థితి, గతి మారిపోయింది. ఊర్లో చాలామంది అతని లోని మార్పును చూసి ఆశ్చర్యపోయారు. అనంతుడు మాత్రం తనలోని మార్పుకు కారణం "దారి దీపం" అయిన చేతి కాగడా మరియు స్వామీజీ చెప్పిన శ్లోకం అని భావించాడు. మనసులోని అశాంతి అనే చీకటికి దారి దీపం భగవంతుని స్తుతించడమే! అలాగే చీకటిలో నడవాలంటే దారిదీపమే దారిని చూపిస్తుంది. ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కోవడానికి కావలసిన ఆత్మవిశ్వాసం వెలిగించే "దారి దీపం" దేవుని పైన విశ్వాసమే! అని అనంతుడు తాను తెలుసుకోవడమే కాకుండా ఊరిలో ఎంతో మందికి తెలియచెప్పాడు. ★

PRAPATTI SRISANNIDHANAM Telugu Monthly MAR 2024 RNI NO : TELTEL12303

# శ్రీసన్నిధి పదకేళి

## ఆధారాలు నిలువు:

1. పాండవ మధ్యముడు...(4)
2. కృష్ణ పక్షంలో చివర వచ్చే తిథి..(4)
3. లంకాదహనం చేసింది ఎవరు. (5)
4. పెళ్ళి సమయంలో ఏ నక్షత్రానికి నమస్కరిస్తారు 4)
5. మాఘ ఫాల్గుణాలలో వచ్చే ఋతువు పేరు (6)



## ఆధారాలు అడ్డం:

5. స్మారకంగా ప్రారంభోత్సవాల్లో ఉంచే ఫలకం (5)
6. ఫాల్గుణ పూర్ణిమ నాడు వచ్చే పండుగ. (2)
7. అమ్మాయి పేరుతో ఉండే రాశి (2)
8. కోణార్క్ దేవాలయం ఏ దేవునికి ప్రసిద్ధి (2)
9. విజయవాడ ఏ గుడి ప్రసిద్ధి. 2)
10. శివుడు ధరించే ఆయుధం (3)
11. రామాయణంలో లంకాధిపతి సోదరుడు.(5)
12. మహాభారతంలో పుట్టుకతో అంధుడైన రాజు (5)
13. సృష్టికర్త అని ఎవరిని అంటారు (2)

## పోటీలో పాల్గొనండి!

## ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు వాట్సప్ ద్వారా పంపించండి. ఫలితాలతో ఆ నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు ప్రత్యక్షంగా ఆ నెల పత్రిక ఉచితంగా మీకు అందిస్తాము. సరియైన జవాబులు 9502583323 వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and printed at RIMSHA PRINTERS, H No 5-16/1, Alugunur (V), Thimmapur(M), Karimnagar District, Telangana-505 001 and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001 Editor DINGIRI SRINIVASA MURTHY RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.